# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 2-11-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 68 పేజీలు:6 వెల: రూ.1/-


## ముందు అమేథీలో గెలువు.. రాహుల్ గాంధీపై కేటీఆర్ ట్వీట్

హైదరాబాద్, నవంబర్ 1:తెలంగాణ సీఎం కేసీఆర్ జాతీయ పార్టీ పెట్టడాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ విమర్శించారు. భారత్ జోడో యాత్రలో పాల్గొంటున్న ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆ అంశంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ఇవాళ మంత్రి కేటీఆర్ తన ట్విట్టర్‌లో రియాక్ట్ అయ్యారు. అంతర్జాతీయ నేత రాహుల్ గాంధీ తన స్వంత పార్లమెంట్ నియోజకవర్గం అమేథీలోనే గెలవలేకపోయారని విమర్శించారు. జాతీయ పార్టీ ఆశయాలతో ముందుకు వెళ్తున్న సీఎం కేసీఆర్‌ను విమర్శించే హక్కు రాహుల్‌కు లేదని మంత్రి ఆరోపించారు.

ప్రధానమంత్రి కావాలనుకుంటున్న రాహుల్ గాంధీ.. ముందుగా ప్రజల్ని ఒప్పించి స్వంత నియోజకవర్గంలో ఎంపీగా గెలవాలని మంత్రి కేటీఆర్ సెటైర్ వేశారు. 2019లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నుంచి ఎంపీగా పోటీ చేసి రాహుల్ ఓడిపోయిన విషయం తెలిసిందే.

## బీజేపీ డ్రామాలను నమ్మొద్దు : మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నవంబర్ 1:స్వార్థం, అహంకారంతో వచ్చిన మునుగోడు ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని మంత్రి హరీశ్‌రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మునుగోడు నియోజకవర్గం చండూరులో నిర్వహించిన రోడ్ షోలో మంత్రి మాట్లాడారు. “దుబ్బాక, హుజురాబాద్ ఎన్నికల్లో ఆడిన డ్రామాలనే బీజేపీ నాయకులు మళ్లా మొదలు పెట్టిండ్రు . వారి మాటలకు పడవద్దు. ఓడిపోయేవాడు ఆగం ఆగం చేస్తడు . టీఆర్ఎస్ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలే” అని సూచించారు.

గ్యాస్ ధర రూ. 400 నుంచి రూ. 1200 చేశారని,డీజిల్, పెట్రోల్ రేట్లు అమాంతం పెంచారని,ప్రభుత్వ సంస్థలను అమ్మేశారని దుయ్యబట్టారు.‘ బాయి దగ్గర మోటర్లకు మీటర్లు పెడుతాం అంటున్నారు. రేట్లు పెంచుతాం అంటున్నారు. ఇటువంటి వాళ్లకు ఓట్లు వేయవద్ద’ ని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు పెట్టించారని ప్రజలుజాగ్రత్త గా చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, బీజేపీ పార్టీ ఒక్క పనైనా చేసిందా అని ప్రశ్నించారు.సీఎం కేసీఆర్ మునుగోడు నియోజకవర్గానికి వెయ్యి ఇండ్లు ఇస్తే రాజగోపాల్ రెడ్డి పేదలకు ఒక్క ఇల్లు కట్టలేదని విమర్శించారు. ప్రతి మూడు నెలలకు నియోజకవర్గానికి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. మంత్రి హరీశ్‌రావు వెంట మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు, ఎమ్మెల్యేలు వినయు భాస్కర్, సుమన్,ఎమ్మెల్సీ ఎల్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడులో ముగిసిన ఉప ఎన్నిక ప్రచారం

నల్లగొండ, నవంబర్ 1: మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు ముగిసింది. 25 రోజుల పాటు ఆయా పార్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. రోడ్ షోలు, ర్యాలీలతో మునుగోడు సందడిగా మారింది. మొత్తంగా ప్రచార సమయం ముగియడంతో.. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఆయా పార్టీల నేతలు తమ ప్రాంతాలకు తిరిగి వెళ్తున్నారు. దీంతో మునుగోడు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు ఖాళీ అయ్యాయి.

ఈ ఉప ఎన్నిక పోరులో టీఆర్ఎస్ నుంచి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కాంగ్రెస్ తరపున పాల్వాయి స్రవంతి రెడ్డి, బీజేపీ తరపున రాజగోపాల్ రెడ్డి బరిలో ఉన్నారు. మొత్తంగా 47 మంది బరిలో ఉన్నారు.

ఈ నెల 3వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. 6వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలో 2,41,855 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 5,686 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నప్పటికీ, కేవలం 739 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 298 ఏర్పాటు చేశారు. అర్బన్‌లో 35, రూరల్‌లో 263 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. 105 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. మునుగోడు నియోజకవర్గ పరిధిలో ఓటరు స్లిప్పుల పంపిణీ ఇప్పటికే పూర్తయింది. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు స్లిప్పులను డౌన్ లోడ్ చేసుకోవచ్చు. తొలిసారి కొత్త నమూనా ఓటరు కార్డులను పంపిణీ చేశారు.

## మొనగాళ్లకు, మోసగాళ్లకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది : కేటీఆర్





హైదరాబాద్, నవంబర్ 1: మునుగోడు ఉప ఎన్నికను ఉద్దేశించి టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో మాట్లాడారు. మొనగాళ్లకు, మోసగాళ్లకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది అని కేటీఆర్ తేల్చిచెప్పారు. ఈ ఉప ఎన్నికలో తెలంగాణ ప్రగతికి, తెలంగాణ పురోగతికి పట్టం కడుతారనే ఉద్దేశంతో కొన్ని విషయాలు మీ దృష్టికి తీసుకువస్తున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. ఓటు అనే వజ్రాయుధాన్ని సవ్యంగా వాడండి. ఆగం కాకండి. ప్రజాస్వామ్యం గెలవాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

మునుగోడు ప్రజల ఆత్మగౌరవానికి, బీజేపీ అహంకారానికి మధ్య జరుగుతున్న సమరంలో.. పెద్ద ఎత్తున పని చేసిన టీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. సర్వశక్తులు ఒడ్డి, బీజేపీ అగ్ర నాయకత్వం దృష్టి పెట్టి, ఎన్నో ప్రయత్నాలు, కుయుక్తులు కుట్రలు పన్ని రాజ్యాంగ సంస్థలను తన ఆధీనంలో పెట్టుకుని, ఎన్నికల గుర్తుల విషయంతో పాటు, మా మంత్రిని ప్రచారానికి రాకుండా ఆపారు. అయినప్పటికీ టీఆర్ఎస్ కార్యకర్తలు అద్భుతంగా పోరాటం చేశారు. అదే విధంగా టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డికి మద్దతు తెలిపి ప్రచారంలో పాల్గొన్న వామపక్షాల నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు కేటీఆర్.

### గెలవమని తెలిసి బీజేపీ భౌతికదాడులు..

బీజేపీ నాయకులు నిన్ననేమో టీఎన్జీవోల మీద అనుచిత వ్యాఖ్యలు చేశారు. దుర్మార్గంగా అవమానించారు. ఇవాళ టీఎన్జీవో కార్యాలయంపైన కూడా దాడి చేయించే ప్రయత్నం చేశారు. ఇవాళ మనుగోడు మండలం పలివెలలో దాడులకు దిగారు. గెలుస్తలేమని బోధ పడిన తర్వాత, చిల్లరగా భౌతికదాడులకు దిగింది బీజేపీ. ఆ దాడుల్లో టీఆర్ఎస్ నాయకులకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తం కారేలా దాడులు చేశారు.

### మునుగోడులో అభివృద్ధి, సంక్షేమం ఆగలేదు..

మునుగోడు నియోజకవర్గంలో దశాబ్దాలుగా పరిష్కారం కానీ పనులను చేసి చూపించామని కేటీఆర్ తెలిపారు. తాగునీటి సమస్యతో సతమతమవుతున్న మునుగోడుకు మిషన్ భగీరథతో శాశ్వత పరిష్కారం చూపించాం. ఫ్లోరోసిస్ ను నిర్మూలించాం.

రాజీనామా చేసిన రాజగోపాల్ రెడ్డి అనాథలా మునుగోడును వదిలిపెట్టినప్పటికీ, అభివృద్ధి, సంక్షేమం ఆగలేదు. రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చాం. రైతుబంధు, రైతుబీమా అమలు చేశాం. శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కృష్ణా జలాల విషయంలో మోదీ తాత్సరం చేస్తున్నారు. ఒక వేళ అది పూర్తి చేసి ఉంటే ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యేవి. ఇంటింటికి టీఆర్ఎస్ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. నరేంద్ర మోదీ యువతను నమ్మించి మోసం చేశారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా దండు మల్కాపురంలో అతిపెద్ద పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తున్నాం. చండూరును రెవెన్యూ డివిజన్ చేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు.

### దమ్మిడి పని కూడా చేయలేదు..

కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ప్రజలు ఎన్నో అవకాశాలు ఇచ్చినప్పటికీ దమ్మిడి పని కూడా చేయలేదు. కేంద్రంలో అధికారంలో ఉన్నవారు క్రూరంగా, కిరాతకంగా ప్రవర్తించారు. ఫ్లోరోసిస్ బాధితులను పట్టించుకోలేదు. రక్షిత మంచినీటి కోసం నిధులు ఇవ్వమంటే కేంద్రం 19 పైసలు కూడా మంజూరు చేయలేదు. జేపీ నడ్డా 300 పడకల ఆస్పత్రి పెడుతానని చెప్పిండు. కానీ నోచుకోలేదు. శివన్నగూడెం, లక్ష్మణాపురం ప్రాజెక్టులకు నయా పైసా సహాయం చేయలేదు. కృష్ణా జలాల్లో వాటా తేల్చకుండా సతాయిస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

### కన్నీళ్లు, కష్టాలు డబుల్ అయ్యాయి..

మునుగోడు నియోజకవర్గంలోని నేతన్నలను చావుదెబ్బ కొడుతున్నారు. ప్రధాని మోదీ చేనేతకు మరణ శాసనం రాస్తున్నారు. నేతన్నలను కేసీఆర్ కాపాడుకుంటున్నారు. రైతులను మోదీ పట్టించుకోవట్లేదు. రుణాలు మాఫీ చేయడం లేదు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతులను చావగొట్టారు. రైతు ఆదాయం డబుల్ చేస్తానని చెప్పి, ఇవాళ క్రూరమైన చర్యలకు పాల్పడుతున్నాడు. కన్నీళ్లు, కష్టాలు, పెట్టుబడి డబుల్ అయింది. తెలంగాణలో పండిన వడ్లు కొనం కానీ, తెలంగాణ ఎమ్మెల్యేలను వందల కోట్లతో కొంటామని ఢిల్లీ నుంచి బ్రోకర్లను పంపించారని కేటీఆర్ మండిపడ్డారు.

### ఆశ్చర్యపరిచేంత మంచి మెజార్టీతో గెలుస్తాం..

మునుగోడు ఓటర్లు తేల్చుకోవాలి. ఎటు వైపు ఉండాలో ఆలోచించుకోని ఓటు వేయండి. బీజేపీ ప్రలోభాలకు లొంగకండి. కెలికి కయ్యం పెట్టుకుని ఓటర్లను ఆందోళనకు గురి చేస్తారు. టీఆర్ఎస్ శ్రేణులు సంయమనం పాటించండి. అందర్నీ ఆశ్చర్యపరిచేంత మంచి మెజార్టీతో గెలుస్తాం. మళ్లీ 6వ తేదీన కలుసుకొని మాట్లాడుకుందామని చెప్పి కేటీఆర్ తన ప్రెస్ మీట్‌ను ముగించారు.

## బయోమెట్రిక్ హాజరుపై కలెక్టర్ సమీక్ష



ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): బయోమెట్రిక్ హాజరు అమలుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని ప్రజ్ఞ సమావేశ మందిరంలో అధికారులు, తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ప్రతినిధులతో బయోమెట్రిక్ హాజరుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన, సాంఘీక సంక్షేమ శాఖల వసతి గృహాల్లో బయోమెట్రిక్ హాజరును ప్రవేశపెట్టినట్లు అట్టి దానిని వందశాతం అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ప్రతినిధులు సమస్యలు గుర్తించి, అన్నిచోట్లా హాజరు బయోమెట్రిక్ లో నమోదు అయ్యేలా చూడాలని, ట్రెజరీ అధికారులకు బయోమెట్రిక్ హాజరుతో బిల్లుల స్క్రూటిని చేసేలా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. విద్యాశాఖలో బయోమెట్రిక్ హాజరు అమలుకు ఉద్దేశించిన జిల్లాల జాబితాలో ఖమ్మం జిల్లాను చేర్చుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బయోమెట్రిక్ హాజరుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరుకు ఉన్న పరికరాల పరిస్థితిని చూసి, వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలన్నారు. బిసి సంక్షేమ వసతి గృహాల్లో కరోనాకు పూర్వం ఉన్న బయోమెట్రిక్ హాజరు పరిస్థితిని పరిశీలించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య, డిడి సాంఘీక సంక్షేమం కస్తాల సత్యనారాయణ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కృష్ణా నాయక్, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జ్యోతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్య అధికారి రవి బాబు, ఇడిఎమ్ దుర్గాప్రసాద్, టీఎస్ ప్రతినిధులు అభిషేక్, పవన్ కుమార్, భానుతేజ, ప్రహ్లాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కారులో అక్రమంగా తరలిస్తున్న ఆయుధాలు సీజ్.. 90 కిలోమీటర్లు చేజ్ చేసి పట్టుకున్న పోలీసులు

భోపాల్, నవంబర్ 1: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖర్గోన్ జిల్లాలో అక్రమంగా ఆయుధాలను తరలిస్తున్న దుండగులను పోలీసులు సినీ ఫక్కీలో చేజ్ చేశారు. దుండగుల కారును ఏకంగా 90 కిలోమీటర్లు చేజ్ చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. అయితే దుండగులు కారును వదిలి పారిపోయారు. అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్నారన్న సమాచారం అందడంతో మధ్యప్రదేశ్ పోలీసులు ఇవాళ ఉదయం ఇండోర్‌లో ఆగ్రా –ముంబై జాతీయ రహదారిపై హర్యానా రిజిస్టర్డ్ కారునుఅయితే, నలుగురు దుండగులు కారును ఆపకుండా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు మరింత వేగంగా పోనిచ్చారు. దాంతో పోలీసులు వారిని వెంబడించారు. ఈ క్రమంలో మార్గమధ్యలో ఒకచోట దుండగులు పోలీస్ వాహనాన్ని ఢీకొట్టారు. చివరకు ఇండోర్‌కు 90 కిలోమీటర్ల దూరంలోని ఖల్‌ఘాట్‌కు చేరుకున్నారు.

## రైతుబంధు కావాలా..? రాబందు కావాలా..? : మంత్రి కేటీఆర్

నల్లగొండ, నవంబర్ 1:మునుగోడు ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ నారాయణపురంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 14 నెలల్లో మునుగోడును బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తాం. నారాయణపురం ప్రజలు ఏ గట్టున ఉంటారో తేల్చుకోవాలి.

మందు, మటన్ పెట్టగానే గందరగోళం కావొద్దు. ఎవరి వల్ల మన బతుకులు బాగుపడుతాయో ఆలోచించండి. మనది పేదల ప్రభుత్వం.. బీజేపీది పెద్దల ప్రభుత్వం. రైతు బంధు కావాలా.? రాబందు కావాలా? ఆలోచించుకోండి.

ఇక్కడ పోరాటం జరుగుతున్నది.. రెండు భావజాలాల మధ్యన. రెండు పార్టీల మధ్యన, కానీ ఇద్దరు వ్యక్తుల మధ్యన కాదు. 18 వేల కోట్లకు అమ్ముడుపోయిన రాజగోపాల్ రెడ్డి. ఇంటింటికీ తులం బంగారం ఇచ్చిన ఇస్తడు. తులం బంగారం ఇచ్చిన తీసుకోండి.. అవన్నీ దొంగల పైసలు.. గుజరాత్ వాళ్ల పైసలు. గరీబోళ్ల పార్టీ నాయకుడు కేసీఆర్‌కు ఓటేయండి. బీజేపీకి ఓటుతోనే సమాధానం చెప్పండి. మునుగోడును సస్యశ్యామలం చేయబోతున్నాం. రాచకొండకు కూడా లిఫ్టులు పెట్టిస్తాం. ఆలోచన చేయండి.. ఆగం కాకండి.. డబ్బుకో, మందుకో లొంగిపోయి బీజేపీకి ఓటేస్తే.. మన కంట్లో మనమే పొడుచుకున్నట్టే అని తెలిపారు.

మునుగోడు ఉప ఎన్నిక ఎందుకు వచ్చిందో మీకందరికీ తెలుసు. ఏ ఎమ్మెల్యేనైనా పైకి పోతే ఉప ఎన్నిక వస్తది. ఇక్కడ్నేమో అమ్ముడుపోతే వచ్చింది. రాజగోపాల్ రెడ్డి 18 వేల కోట్ల కాంట్రాక్ట్ కు మునుగోడు ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాడు. నాలుగేండ్ల నుంచి ఒక్క పని కూడా చేయలేదు. మునుగోడు ప్రజలను తులం బంగారం ఇచ్చి అయినా సరే గెలుస్తాననే ధీమాతో ఈ ఎన్నిక రుద్దిండు. మోదీ అహంకరాం, రాజగోపాల్ రెడ్డి మదంతో వచ్చిన ఎన్నిక ఇది.

మోదీ అధికారంలోకి వచ్చాక ఒక్క మంచి పని చేయలేదు. మోదీ ప్రభుత్వం ఏర్పడిన సమయంలో సిలిండర్ ధర రూ. 400 ఉంటే.. ఇప్పుడు రూ. 1200లకు పెంచిండు. ఎంత బలుపు. అయినా నాకే ఓటు వేస్తారని, వారికి చైతన్యం లేదనే బలుపుతో వారు ఉప ఎన్నిక తీసుకొచ్చారు. ఉప్పు, పప్పు, చింతపండుతో పాటు అనేక నిత్యావసరల ధరలు పెరిగాయి. పెట్రోల్ ధర రూ. 70 ఉండే.. ఇప్పుడు రూ. 110. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే ఆర్టీసీ ఛార్జిలు కూడా పెరుగుతాయి. సామాన్యుడి బతుకును మోదీ నాశనం చేశాడు. కార్పొరేట్లను కడుపులో పెట్టుకుని చూసుకుంటుండు అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రాగల మూడు రోజుల్లో హైదరాబాద్‌లో వర్షాలు..!

హైదరాబాద్, నవంబర్ 1: ఈశాన్య రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. దీంతో తమిళనాడు, పుదుచ్చేరి, కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో.. రాగల మూడు రోజుల్లో హైదరాబాద్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నవంబర్ 4వ తేదీ వరకు నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. సాయంత్రం, రాత్రి సమయాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉదయం వేళల్లో పొగమంచు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## ఢిల్లీ పర్యటనలో గవర్నర్ తమిళిసై.. ఆరోగ్య మంత్రి మన్సూఖ్ మాండవీయతో భేటీ

న్యూఢిల్లీ, నవంబర్ 1: మునుగోడు ఎన్నికల వేళ తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఢిల్లీ పర్యటన ఆసక్తి రేకెత్తించింది. కేంద్ర పెద్దలకు మునుగోడు ఉప ఎన్నికలపై నివేదిక సమర్పించేందుకే ఆమె ఢిల్లీ వచ్చారని ఊహాగానాలు వినిపించాయి. మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న తమిళిసై పుదుచ్చేరి లిబరేషన్ డే సందర్భంగా ఇండియా గేట్ సమీపంలోని నేషనల్ వార్ మెమోరియల్‌లో అమర వీరులకు నివాళులర్పించారు.త్రివిధ దళాల అధికారులు అమర సైనికుల గురించి ఆమెకు వివరించారు. అనంతరం నిర్మాణ్ భవన్‌లో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్సూఖ్ మాండవీయను కలిశారు. తెలంగాణ, పుదుచ్చేరికి సంబంధించిన పలు వైద్య, ఆరోగ్య అంశాలపై గవర్నర్ చర్చించారు. పుదుచ్చేరిలో వైద్య విశ్వవిద్యాలయం, కళాశాల ఏర్పాటునకు సహకరించాలని వినతి పత్రం సమర్పించారు. తెలంగాణలోని బీబీ నగర్ ఎయిమ్స్ లో మౌలిక వసతుల కల్పన మీదా తమిళిసై కేంద్రమంత్రితో చర్చించారు. రాష్ట్రంలో వైద్య సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలని తమిళిసై కోరారు.

## మంత్రి కేటీఆర్ హ్యూమానిటీ.. యాక్సిడెంట్‌కు గురైన భార్యాభర్తలను కాన్వాయ్‌లో హాస్పిటల్‌కు తరలింపు



నల్లగొండ, నవంబర్ 1:మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం ముగించుకొని ఇవ్వాల (మంగళవారం) మంత్రి కేటీఆర్ హైదరాబాద్ వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ పై వెళ్తున్న ఇద్దరు భార్యాభర్తలు రోడ్డు ప్రమాదానికి గురవ్వడం చూసి తన కారును ఆపించారు. రోడ్డు పక్కన ఉన్న గాయాలతో బాధపడుతున్న వారి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. అంతేకాకుండా స్వయంగా తన కాన్వాయ్ వాహనంలో గాయపడ్డ యాక్సిడెంట్ బాధితులను హైదరాబాద్ లోని హాస్పిటల్ కి తరలించారు. మంత్రి కేటీఆర్ హ్యూమానిటీ, సింప్లీసిటీని చూసి చాలామంది భేష్ అంటున్నారు.

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ చతురత నిండిన కేథలను
వెతలను దొలగించు రీతి వివరింపంగన్
మతిమంతుడనిగా దలచుచు
నెతురె డెదను 'పానుగంటి నరసింహునకున్!

(నవంబర్ 2 పానుగంటి లక్ష్మీ నరసింహారావు జయంతి..)



–రాధశ్రీ
సెల్:9494481210




## అరసం కథా స్రవంతి
10 కథా సంపుటాల ఆవిష్కరణ

1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు
2. తాళ్లూరు నాగేశ్వరరావు కథలు
3. శశిశ్రీ కథలు
4. శాంతి నారాయణ కథలు
5. పెద్దింటి అశోక్‌కుమార్ కథలు
6. బలివాడ కాంతారావు కథలు
7. సతీష్ చందర్ కథలు
8. కరుణకుమార కథలు
9. వి.ఆర్.రాసాని కథలు
10. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు

పది పుస్తకాల సెట్ ధర రూ. 670/-
ఆవిష్కరణ సందర్భంగా సెట్ రూ. 550/- మాత్రమే

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం మరియు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో

### కథా స్రవంతి సంపుటాల ఆవిష్కరణ సభ

| | |
|---|---|
| సభాధ్యక్షులు | : డా॥ రాపోలు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం |
| ముఖ్య అతిథి & ఆవిష్కర్త | : ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం |
| గౌరవ అతిథి | : శ్రీ జూలూరు గౌరీశంకర్, అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ |
| విశిష్ట అతిథి | : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, అదనపు కలెక్టర్, మేడ్చల్ జిల్లా |
| ఆత్మీయ అతిథి | : డా॥ మామిడి హరికృష్ణ, సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ |
| పుస్తకాల పరిచయం | : శ్రీ కె.పి.అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు |
| ప్రత్యేక అతిథులు | : శ్రీ సతీష్ చందర్, ప్రముఖ కవి, కథా రచయిత; శ్రీ పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ కథా రచయిత |
| ప్రధాన సంపాదకులు | : శ్రీ వల్లూరు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆం.ప్ర. అరసం |
| వేదిక | : రవీంద్రభారతి (మినీహాలు, మొదటి అంతస్థు), హైదరాబాదు |
| తేది & సమయం | : తేది: 5-11-2022, శనివారం, సా॥ 6 గం॥లకు |

అందరూ ఆహ్వానితులే

డా॥ పల్లేరు వీరాస్వామి
కార్యనిర్వాహక కార్యదర్శి, తెలంగాణ అరసం
9441779688

# డాలర్‌ను చూసి రూపాయి వణుకు..!

ప్రపంచ మానవాళికి దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉంది. కోవిడ్-19 విపత్తు పూర్తిగా సమసిపోక ముందే ఉక్రెయిన్-రష్యా యుద్ధం రావడం, యుద్ధం కొనసాగుతున్న వేళ డాలర్ విలువ పెరగడం (రూపాయి విలువ నేల చూపులు చూడడం) వెంట వెంటనే జరిగి పోతున్నాయి. ఈ మూడు సంక్షోభాలతో మానవాళి అనేక అవస్థలను పడుతున్నది. ఇలాంటి విపత్తులను అనుభవిస్తున్న ప్రపంచ మానవాళి జీవనశైలి సమూల మార్పులకు లోనవుతున్నది. దేశాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, అవిద్య, అధిక జనాభా, అరకొర ప్రజారోగ్య వసతులు, నిరుద్యోగం లాంటి సమస్యలకు తోడుగా నేడు రూపాయి విలువ నేల చూపులు చూడడంతో జనజీవనం అస్తవ్యస్తం అవుతున్నది.

కరోనా కల్లోల అలలు:

కరోనా విజృంభణతో వ్యక్తుల నుంచి వ్యవస్థల వరకు, కుటుంబం నుంచి సమాజం వరకు, దేశం నుంచి ప్రపంచ దేశాల వరకు మానవ జీవనశైలి కుదుపులకు లోనైంది. ప్రపంచ దేశాలు ఆర్థిక, సామాజిక, సంస్కృతికి మార్పులతో అతలాకుతలం అయ్యింది. కొడుక్కు తల్లితండ్రులు, తాతకు మనుమడు, మనిషికి మనిషే శత్రువన్నట్లు భౌతిక దూరాల అనివార్యత ఏర్పడింది. కుటుంబ ఆదాయం కరగడం, ఉద్యోగ ఉపాధులు ఊడడం, వేతనాల్లో తీవ్ర కోతల వాతలు పడడం, విద్యాలయాలకు తాళాలు పడడం, లాక్‌డైన్ నియమాలతో ఇంటికి పరిమితం కావడం, పరిశ్రమలు మూతపడడం, ఎగుమతి దిగుమతులు తరగడం లాంటి అనేక అవాంతరాల నడుమ మానవ జీవితాలు అత్యంత ప్రమాదకరంగా మారడం చూసాం, అనుభవించాం. కరోనా విపత్తుతో ప్రపంచ సగటు జిడిపీ 3.4 శాతం వరకు పడిపోవడంతో ఆర్థిక మాంద్యం గమనించాం. కోవిడ్ కోరల్లో చిక్కి 214 మిలియన్ల ఉద్యోగాలు పోవడం, అందులో 62 మిలియన్ల పర్యాటరంగ ఉద్యోగాలు పోవడం జరిగింది. కరోనా విపత్తుతో 7 శాతం వరకు ప్రపంచ వాణిజ్యం తగ్గడం, 25 శాతం వ్యాపార రెవెన్యూ పడిపోవడం, 11 శాతం శ్రామికులు ఉపాధులు కోల్పోవడం, 4 శాతం వ్యాపారాలు నష్టాలతో మూత పడడం, 55 శాతం వ్యాపారాలు ప్రభావితం కావడం జరిగిపోయింది.

దెబ్బ మీద దెబ్బ : ఉక్రెయిన్ – రష్యా యుద్ధం:

గోరుచుట్టుపై రోకలి పోటులా కోవిడ్-19 అలలు కరుగుతున్నాయని మనిషి మహా ఊరట చెందుతున్న తరుణంలో మరో పిడుగు లాంటి ఉక్రెయిన్‌పై రష్యా మూకుమ్మడి దాడి ప్రచండ యుద్ధంగా గత 8 నెలలుగా కొనసాగుతున్నది. కరోనా కాటు నుంచి తేరుకోక ముందే దెబ్బ మీద దెబ్బలా ఈ రెండు దేశాల మధ్య జరుగుతున్న ఈ యుద్ధం నేడు ప్రపంచ దేశాల నలుమూలల ఉన్న మానవాళి సాధారణ జీవనాన్ని ప్రమాదంలోకి నెట్టింది. ఉక్రెయిన్ రష్యా యుద్ధంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు, వంట నూనెలు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల ధరలు చుక్కలను తాకడం, స్టాక్‌మార్కెట్ కుదుపులతో ద్రవ్యోల్బణం పెరగడం, దేశ ఆర్థిక మాంద్యాలకు లోనుకావడం జరుగుతోంది. ఈ యుద్ధంతో ప్రత్యక్షంగా మారణహోమం, క్షతగాత్రుల ఆక్రందనాలు, బారులు తీరిన మిలియన్ల వలసలు, పర్యావరణ విధ్వంసాలు, మౌలిక వసతుల నష్టాలు, మానవాళి సంక్షోభాలు పుట్టుకొచ్చాయి.

రూపాయి విలువ పతనం:

మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు కరోనా విపత్తు, యుద్ధ విధ్వంస దుష్ఫలితాల నుంచి తేరుకునే ప్రయత్నం చేస్తున్న గడియల్లో నేడు డాలర్ విలువతో పోల్చితే భారత రూపాయి విలువ విపణి వీధుల్లో ఆసాంతం పడిపోవడంతో భారతం మరో ప్రమాదకర కుదుపులకు గురవుతున్నది. అమెరికన్ డాలర్ విలువ పెరుగుతున్న వేళ ప్రపంచ దేశాల కరెన్సీ విలువలు తరుగుతుండడం జరుగుతున్నది. డాలర్ విలువ బలపడడంతో ఇండియన్ రూపాయి విలువ కుచించుకుపోతూ నేడు ఒక డాలర్‌కు రూపాయి విలువ 82.00కు పైగా వరకు పతనం కావడం చూస్తున్నాం. అమెరికన్ డాలర్ విలువ పెరగడానికి కారణాలుగా పెరిగిన అమెరికల్ వడ్డీ రేట్లు, అంతర్జాతీయంగా శక్తి వాణిజ్య/వ్యాపారాలు, యూయస్‌లో పెట్టుబడుల కోసం విదేశీ పెట్టుబడుల ఉపసంహరణలు, అమెరికాలో పెట్టుబడులు పెరగడం లాంటి పలు అంశాలను ప్రస్తావిస్తున్నారు.

పలు దేశాల కరెన్సీ పతనాలు:

డాలర్ విలువ దినదినం పైపైకి పాకడంతో భారత్‌తో పాటు ప్రపంచ దేశాల కరెన్సీలన్నీ పాతాళం వైపు చూడడం గమనిస్తున్నాం. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పూర్వం 24 ఫిబ్రవరి 2022న డాలర్ మారకం విలువ 74.64 రూపాయలు ఉండగా గత 8 మాసాల్లో 17 అక్టోబర్ 2022 రోజున ? 82.29 వరకు విలువ పతనం కావడంతో రూపాయి విలువ 9 శాతం వరకు పడిపోవడం గమనిస్తున్నాం. రూపాయి పతనంతో పోల్చితే ఇతర దేశాల కరెన్సీలు అధికంగా ప్రభావితం అయ్యాయని వివరాలు తెలుపుతున్నాయి. ఫిబ్రవరి 2022లో ఒక డాలర్ మారక విలువగా 0.89 యూరోలు ఉండగా 17 అక్టోబర్‌న 1.03 యూరోలకు పతనంతో 17 శాతానికి యూరో విలువ దిగజారడం గమనించాం. గత 24 ఫిబ్రవరి 2022న ఒక డాలర్ విలువ 0.75 జిబిపీ (బ్రిటన్ పౌండు)లు ఉండగా 17 అక్టోబర్ రోజున 17 శాతం పడిపోయి 0.89కు చేరింది. గత ఫిబ్రవరి-2022లో ఒక డాలర్‌కు సమానంగా 6.33 చైనీస్ యాన్ ఉండగా 17 అక్టోబర్‌న 7.2కు పడిపోయింది. ఆస్ట్రేలియన్ డాలర్ విలువ 1.40 నుంచి 1.60 వరకు, అనగా 14 శాతం పడిపోవడం గమనించాం. సింపూర్ డాలర్ విలువ గత ఫిబ్రవరిలో 1.36 ఉండగా అక్టోబర్‌లో 1.43 వరకు తగ్గి 5 శాతం పతనం అయ్యిందని విధితమవుతున్నది.

రూపాయి పతనం అతి నష్టదాయకం:

గత 8 నెలల్లో (24 ఫిబ్రవరి నుంచి 17 అక్టోబర్ 2022 వరకు)యూయస్ డాలర్ విలువతో పోల్చితే భారత రూపాయి 9 శాతం పతనం చెందగా, యూరో/పౌండు 17 శాతం, చైనీస్ యాన్ 7.2 శాతం, ఆస్ట్రేలియన్ డాలర్ 14 శాతం, సింగపూర్ డాలర్ 5 శాతం వరకు పతనం కావడం గమనించారు. పలు దేశాల కరెన్సీలతో పోల్చితే ఇండియన్ రుపీ విలువ స్థిరంగా ఉండడం, భారత ప్రభుత్వంతో పాటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న సత్వర చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని అవగతం అవుతున్నది. డాలర్ విలువ పెరిగినా, రూపాయి విలువ తగ్గినా నష్టం మాత్రం మనకే అని అర్థం చేసుకోవాలి. రూపాయి విలువ పతనం వల్ల దిగుమతులకు డాలర్లలో చెల్లింపులు చేయాల్సి ఉంటుంది కాబట్టి మనకు అధిక నష్టం జరుగుతుందని గమనించాలి. ముళ్లు ఆకు మీద పడ్డా, ఆకు ముళ్లు మీద పడినా నష్టం ఆకుదే అని భావించాలి. డాలర్ విలువ పెరిగినా, రూపాయి విలువ తరిగినా నష్టం రూపాయికే అవుతుంది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రూపాయి విలువ 100 వరకు తగ్గినా ఆశ్చర్య పడవలసిన పని లేదని హెచ్చరిస్తున్నారు.

ప్రపంచ దేశాల్లో డాలర్‌తో పోల్చితే అతి తక్కువ విలువ కలిగిన కరెన్సీలుగా ఇరానియన్ రియాల్ (1 డాలర్ = 42,400 రియాల్స్), వియత్నమీస్ డోంగ్, లావో, ఇండొనేషియన్ రుపయ్యా, సిరియా లియోన్, యుజ్‌బెక్ సమ్, గ్వీనియా ఫ్రాంక్, పెరాగ్వీన్ గ్వరానీ, కొలంబియన్ పెసో, కాంబోడియన్ రియాల్(1 యూయస్ డాలర్ = 4,084 రియాల్)లు ఉన్నాయని గమనించాలి. రూపాయి విలువ పతనం కావడాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తూ, అవసర చర్యలను తీసుకుంటూ రూపాయి విలువకు అంతర్జాతీయ వేదికలో పట్టం కట్టావని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## గత 8 ఏళ్ళలో భారతదేశ సంస్కరణల కథనంపై నీతి ఆయోగ్ రెండవ అంతర్గత సమావేశం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:భారతీయ సంస్కరణల కథ – గత 8 ఏళ్ళ అన్న ఇతివృత్తం పై నీతి ఆయోగ్ రెండవ శ్రేణి అంతర్గత ఉపన్యాసాన్ని న్యూఢిల్లీలోని సుష్మా స్వరాజ్ భవన్ లో సోమవారం నిర్వహించారు. అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఒఆర్ఎఫ్) ఉపాధ్యక్షుడు గౌతం చికర్మానె కీలకోపన్యాసం ఇచ్చారు. అనంతరం నీతీ ఆయోగ్ సిఇఒ పరమేశ్వరన్ అయ్యర్ ప్యానెల్ చర్చను నిర్వహించారు. చర్చను పాఠశాల విద్య ఢ అక్షరాస్యత కార్యదర్శి అనిత కార్వాల్, ఒఆర్ఎఫ్ ఉపాధ్యక్షుడు గౌతం చికరహమానె, పిక్కీ సీనియర్ ఉపాధ్యక్షుడు సుభ్రకాంత్ పాండా మధ్య జరిగింది.

ఒక ఆర్థిక వ్యవస్థలో మనం ఎప్పుడూ వృద్ధిని గురించి ఆలోచించడమే కాదు మన దేశం వంటి డాటా ఆధారిత దేశంలో పంపిణీ పరిమాణాల గురించి కూడా ఆలోచించాలని తన ముగింపు వ్యాఖ్యాలలో నీతీ ఆయోగ్ వైస్ ఛైర్ సుమన్ బేరీ అన్నారు. 2014 – 2022 మధ్య చోటు చేసుకున్న అతిపెద్ద మార్పు ఏమిటంటే స్థాయీ నైపుణ్యం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, అనేక స్వతంత్ర చొరవలు ఉన్నాయి. ఇప్పుడు యుపిఎ, జన్ ధన్ యోజన, ఆయుష్మాన్ భారత్ ల విషయంలో మనం చూస్తున్నది అద్భుతమైన బట్వాడా చేయగల సామర్థ్యం.

ఈ శ్రేణిలో ప్రారంభ ఉపన్యాసం కోవిడ్ –19 వాక్సినేషన్ : ఇండియా కథను 30 సెప్టెంబర్ 2022న నిర్వహించారు. భారత అభివృద్ధి వ్యూహాల ఉపన్యాస శ్రేణిని ప్రతి నెల నిర్వహిస్తారు. ఈ ఉపన్యాసాలు జాతీయ అభివృద్ధి ప్రాధాన్యతలు, కలుపుకుపోయే వృద్ధికి సంబంధించిన విధానాలు, వివిధ రంగాలలో ఉత్తమ ఆచరణలు, సహకార, పోటీతత్వ ఫెడరలిజంకు సంబంధించిన చొరవలను ప్రోత్సహిస్తోంది.

నేటి ఉపన్యాసానికి సీనియర్ నాయకత్వం, సంయుక్త కార్యదర్శులు, సలహాదారులు, లేటరల్ ఎంట్రెంట్స్ సహా 300మంది వ్యక్తులు హాజరయ్యారు.

## సోషల్ మీడియాలో ఆర్ పిఎఫ్ లో 9500 కానిస్టేబుల్, ఎఎస్ ఐ పోస్టుల నకిలీ రిక్రూట్ మెంట్ నోటిఫికేషన్ వార్త పై స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్ పిఎఫ్)లో 9500 కానిస్టేబుల్, అసిస్టెంట్ సబ్ ఇనస్పెక్టర్ రిక్రూట్ మెంట్ గురించి సోషల్ మీడియాలోనూ, దినపత్రికలలోనూ ఒక కాల్పనిక సందేశం హల్ చల్ చేస్తోంది. ఆర్ పిఎఫ్ లేదా రైల్వే మంత్రిత్వ శాఖ వారి అధికారిక వెబ్ సైట్లో లేదా ఏదైనా ప్రింట్ లేక ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా అటువంటి నోటిఫికేషన్ జారీ చేయలేదని ఇందుమూలంగా తెలియజేయడం జరుగుతోంది.

ఇది అవాస్తవికమైన వార్త కనుక బాధ్యతాయుతమైన మీడియా విస్మరించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికారులు పునరుద్ఘాటించారు.




## అమరావతి కేసు విచారణకు సీజేఐ విముఖత.. మరో ధర్మాసనానికి పిటిషన్ల బదిలీ

న్యూఢిల్లీ, నవంబర్ 1:రాజధానిగా అమరావతి అంశంపై దాఖలైన పిటిషన్లపై విచారణ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి యు.యు.లలిత్ తప్పుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రాజధానిని నిర్ణయించే అధికారం లేదని, ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర హైకోర్టు తీర్పుపై స్టే విధించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. రాష్ట్ర ప్రభుత్వానికి తమ రాజధాని నిర్ణయించుకునే సంపూర్ణ అధికారం ఉందని పేర్కొంది. అమరావతిగా రాజధాని ఉండాలంటూ రైతులు, రాజధాని పరిరక్షణ సమితి మరోవైపు ఏపీ ప్రభుత్వం వేర్వేరుగా వేసిన పిటిషన్లపై మంగళవారం సీజేఐ యు.యు.లలిత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ముందు కేసు విచారణ జరగాల్సి ఉంది.

అయితే నాట్ బిఫోర్ మీ అంటూ సీజేఐ లలిత్ విచారణ నుంచి తప్పుకున్నారు. తాను సభ్యుడిగా లేని మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు. వీలైనంత త్వరగా విచారణకు అనుమతినివ్వాలని అన్నారు. ఏపీ విభజన చట్టం అంశంపై గతంలో తాను అభిప్రాయాన్ని వెల్లడించానని గుర్తు చేశారు. దీంతో అమరావతి రాజధాని పిటిషన్లపై విచారణ వేరే బెంచ్‌కు బదిలీ అయింది. ఈ పిటిషన్ల విచారణ మరో ధర్మాసనం ఎదుట జరగనుంది.

అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసమే మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నామని, కమిటీ నివేదికలను హైకోర్టు పట్టించుకోవడం లేదని రాష్ట్ర ప్రభుత్వం వాదిస్తోంది. రాజధాని కోసం భూముల సేకరణలో అవకతవకలు జరిగాయని, అమరావతిలో రాజధాని నిర్మాణం కంటే వికేంద్రీకరణ ఖర్చు తక్కువని చెబుతోంది. అయితే ప్రభుత్వ అభిప్రాయాన్ని అమరావతి రైతులు వ్యతిరేకిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదని, పాదయాత్రను అడ్డుకోవడం, దాడులు చేయడం మానుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. కీలక మలుపులు తిరుగుతున్న రాజధాని పిటిషన్ల విచారణ సర్వోన్నత న్యాయస్థానం ముందుకు మళ్లీ ఎప్పుడు వస్తుందనేది ఆసక్తిగా మారింది.

## పెండింగ్ అంశాల పరిష్కారం, శుభ్రత అంశాలపై ప్రత్యేక ప్రచారం 2.0ని నిర్వహించిన క్రీడల శాఖ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:క్రీడా శాఖ సెక్రటేరియట్‌తో సహా శాఖ పరిధిలోకి వచ్చే వివిధ సంస్థలలో ప్రత్యేక ప్రచారం 2.0 నిర్వహించింది. పెండింగ్ అంశాల పరిష్కారం, శుభ్రత అంశాలపై అక్టోబర్ 2 నుంచి 30 వరకు ప్రత్యేక ప్రచారం 2.0 కార్యక్రమం జరిగింది. క్రీడా శాఖ సెక్రటేరియట్‌తో సహా శాఖ పరిధిలోకి వచ్చే స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ూంఎ), లక్ష్మీబాయి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఒఔఎఖఇ), నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ (ఔూజ), నేషనల్ యాంటి డోపింగ్ ఏజెన్సీ (ఔంఆం) మరియు నేషనల్ డోప్ టెస్టింగ్ లాబొరేటరీ (ఔఙఆఒ)లలో 2022 అక్టోబర్ 2 నుంచి 31 వరకు దేశమంతా ఉత్సాహంగా కార్యక్రమం అమలు జరిగింది.

క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సంస్థ కార్యాలయాలు, సంస్థల్లో కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేస్తున్న మంత్రిత్వ శాఖ సంస్థలు, కార్యాలయాలు ప్రచార కార్యక్రమాన్ని అమలు చేసేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చాయి. కార్యక్రమంలో సిబ్బంది, క్రీడలపై ఆసక్తి కలిగి ఉన్నవారు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం అమలు జరిగిన తీరు, సాధించిన ప్రగతి పై ఉన్నత స్థాయిలో తరచు సమీక్షలు జరిగాయి. ప్రచారంలో సాధించిన ప్రగతి, పురోగతిని పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల శాఖ రూపొందించిన ూఅఖఆఓ పోర్టల్‌లో



అప్‌లోడ్ చేయబడ్డాయి. స్వచ్ఛత అభియాన్ కింద స్వచ్ఛత పరుగును కూడా క్రీడల శాఖ నిర్వహించింది. కార్యక్రమానికి ప్రచారం కల్పించేందుకు సామాజిక మాధ్యమాల సహకారం తీసుకోవడం జరిగింది. పెండింగ్ లో ఉన్న అంశాల పరిష్కారం, పరిశుభ్రత పెంపొందించడంలో క్రీడల శాఖ, క్రీడల శాఖ అనుబంధ సంస్థలు గణనీయమైన ప్రగతి సాధించాయి. ఫిట్ (స్వస్త్) మరియు లిట్టర్ ఫ్రీ (స్వచ్ఛ) భారతదేశం నిర్మాణం కోసం చేపట్టిన కార్యక్రమాలను సమీప భవిష్యత్తులో మరింత పటిష్టంగా అమలు చేయాలని క్రీడా శాఖ నిర్ణయించింది. క్రీడా శాఖలో చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమం (క్లీన్ డెస్క్, క్లీన్ సెక్షన్ మరియు క్లీన్ కారిడార్) సందర్భంగా కొన్ని ఫోటోలు ఈ క్రింది విధంగా ఉన్నాయి

## దేశానికే ఆదర్శం సంక్షేమ పథకాలు

### -దేశానికే ఆదర్శం సంక్షేమ పథకాలు-ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్




హైదరాబాద్, నవంబర్ 1:దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతున్నారని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తెలిపారు. సోమవారం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మహేందర్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో గ్రామ, గ్రామానా, వాడ, వాడలా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ, పార్క్‌లు, రోడ్లతో పాటు వివిధ అభివృద్ధి పనులకు రూ. 15 కోట్ల 40 లక్షల రూపాయల నిధుల విడుదలకు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అనంతరం మేయర్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని బస్తీలలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. ప్రజలకు ఏ విధమైన సమస్య ఉన్నా తమకు ఫిర్యాదు చేస్తే తక్షణమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నాలుగు ప్రత్యేక ఆపరేషన్లకు 2022 సంవత్సరానికి కేంద్ర హోంమంత్రి స్పెషల్ ఆపరేషన్ మెడల్

నాలుగు ప్రత్యేక ఆపరేషన్లకు 2022వ సంవత్సరానికి గాను కేంద్ర హోం మంత్రి స్పెషల్ ఆపరేషన్ మెడల్ ను అందించారు. అత్యున్నత స్థాయి ప్రణాళిక, దేశ/ రాష్ట్ర/ కేంద్రపాలిత ప్రాంత భద్రతకు అత్యంత ప్రాముఖ్యత, సమాజంలోని భారీ వర్గాల భద్రతపై ప్రముఖ ప్రభావం కలిగిన ఆపరేషన్లను గుర్తించే లక్ష్యంతో 2018లో ఈ మెడల్ ను ఏర్పాటు చేశారు. ఈ అవార్డును తీవ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, సరిహద్దు చర్యలు, ఆయుధాల నియంత్రణ, మత్తు మందుల స్మగ్లింగ్ నిరోధం, రక్షణ ఆపరేషన్ వంటి అంశాలలో ప్రత్యేక ఆపరేషన్ కు ఈ అవార్డును అందిస్తారు. ఈ అవార్డును ప్రతి ఏడాదీ 31 అక్టోబర్ న అందచేస్తారు.

## వివిధ పీపీపీ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌సీడీపీఎం 2.0 కార్యక్రమం కింద 'పీపీపీ సమస్యల పరిష్కార వేదిక' నిర్వహణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:'పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం' (ఎస్‌సీడీపీఎం) 2.0లో భాగంగా; కేంద్ర నౌకాశ్రయాలు, నౌక రవాణా ఢ జలమార్గాల మంత్రిత్వ శాఖ పరిధిలోని అన్ని ప్రధాన పోర్టులు కార్యశాలలు నిర్వహించాయి. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను పరిష్కరించడానికి పీపీపీ సంబంధిత వర్గాల కోసం ఈ కార్యశాలలను ఏర్పాటు చేశాయి. సాధ్యమైనన్ని ఎక్కువ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం, మిగిలిన సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కాలావధి ప్రకటించడం కార్యశాలల నిర్వహణలో ప్రాథమిక లక్ష్యం.

ప్రధాన ఓడరేవుల్లో, పారాదీప్ పోర్ట్ అథారిటీ వివిధ వర్గాలతో పీపీపీ ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించింది. సంబంధిత వర్గాలు/ క్యాప్టివ్ బెర్త్ ఆపరేటర్ల ప్రతినిధులు ఇందులో పాల్గొన్నారు. వాళ్ల సమస్యలను శ్రద్ధగా విన్న పోర్ట్ మేనేజ్‌మెంట్, వాటిలో చాలా వరకు పరిష్కరించింది.

కాండ్లాలోని దీనదయాళ్ పోర్ట్ అథారిటీ కూడా పీపీపీ ఫిర్యాదుల పరిష్కారం కోసం కార్యశాలను నిర్వహించింది. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్, కాండ్లా ఇంటర్నేషనల్ కంటైనర్ లిమిటెడ్, అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ లిమిటెడ్ వంటి వర్గాలు ఇందులో పాల్గొన్నాయి.

టెర్మినల్ ఆపరేటర్ల కోసం మంత్రిత్వ శాఖ జారీ మార్గదర్శకాల ప్రకారం జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ కూడా 'పీపీపీ ఫిర్యాదుల పరిష్కార సమావేశం' నిర్వహించింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జేఎన్‌పీఏ చైర్మన్, పీపీపీ నమూనా గురించి వివరించారు. మొర్ముగావ్ పోర్ట్ అథారిటీ కూడా 'పీపీపీ ఫిర్యాదుల పరిష్కార సమావేశం' నిర్వహించింది. టెర్మినల్ ఆపరేటర్లు మెస్సర్స్ ఎస్‌డబ్ల్యూపీఎల్ (జేఎస్‌డబ్ల్యూ), అదానీ మొర్ముగావ్ పోర్ట్ టెర్మినల్ లిమిటెడ్ పాల్గొన్నాయి.

న్యూ మంగళూరు పోర్ట్ అథారిటీ (ఎన్ఎంపీఏ) కూడా ప్రత్యేక కార్యక్రమం 2.0లో భాగంగా, ఇప్పటికే ఉన్న పీపీపీ ఢ క్యాప్టివ్ టెర్మినల్/ బెర్త్ వర్గాలతో 'పీపీసీ ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం'పై హైబ్రిడ్ వర్క్‌షాపు నిర్వహించింది. ఎన్ఎంపీఏకు చెందిన అందరు విభాగాధిపతులు, సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. పీపీపీ ఫిర్యాదుల వర్క్‌షాప్ పరిష్కార కార్యక్రమానికి సంబంధిత అన్ని వర్గాలవారు హాజరయ్యారు. ఇక్కడ కూడా వివిధ సమస్యలపై చర్చించారు.

కోల్‌కతాలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ నౌకాశ్రయం, తన వాటాదారులతో పీపీపీ సమస్యల పరిష్కార కార్యశాలను నిర్వహించింది. టీఎంఐఎల్‌ఎల్‌తో దీర్ఘకాలంగా ఉన్న ఒక సమస్యను ఇక్కడ చర్చించి ఒక ఉమ్మడి పరిష్కారం తీసుకున్నారు. పాల్గొన్నవారిలో, సెంచరీ పోర్ట్స్ లిమిటెడ్ ప్రతినిధి మాట్లాడారు. తాము ఇంకా కార్యకలాపాలు ప్రారంభించలేదని, ఒప్పందం కాల పరిమితికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. ఈ పరిష్కార సమావేశాలన్నీ వివిధ వర్గాల మధ్య విభేదాలను తొలగిస్తాయి, పీపీపీ ప్రాజెక్టుల అమలు వేగాన్ని పెంచుతాయి. తద్వారా మెరుగైన, మరింత సమర్థవంతమైన నౌకాశ్రయ సేవలు అందుబాటులోకి వస్తాయి.

2022 అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31 వరకు జరిగిన 'పెండింగ్‌లో ఉన్న అంశాల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమం' (ఎస్‌సీడీపీఎం) 2.0 మొత్తం గొప్ప స్ఫూర్తిని నింపింది. ఓడరేవులు, నౌక రవాణా, జలమార్గాల మంత్రిత్వ శాఖ ప్రధాన సచివాలయం, అన్ని ప్రధాన ఓడరేవులు, ఇతర అనుబంధ/కింది స్థాయి కార్యాలయాలు స్వచ్ఛత ఢ పెండింగ్ అంశాల పరిష్కారం కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాయి. ప్రత్యేక కార్యక్రమం 2.0లో భాగంగా, ఓడరేవులు అనేక 'ఉత్తమ విధానాలు' కూడా అమలు చేశాయి. కార్యాలయ ఆవరణ, చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రపరచడం, అవగాహన కార్యక్రమాలు, దస్త్రాలు ఢ రికార్డుల డిజిటలీకరణ, మొక్కల పెంపకం, ఈ-కార్లు మొదలైనవి మాత్రమేగాక, చాలా నిబంధనలను కూడా సరళీకరించాయి.

## భారతీయ రైల్వేల వ్యాప్తంగా ప్రారంభమైన విజిలెన్స్ అవేర్ నెస్ వారం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:భారతీయ రైల్వేల వ్యాప్తంగా అధికారులు, సిబ్బంది ప్రతిగ్న చేయడంతో విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ ( నిఘా అవగాహన వారం), 2022 ప్రారంభమైంది. ఈ ఏడాది సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విజిలెన్స్ అవేర్ నెస్ వీక్ అభివృద్ధి చెందిన దేశం కోసం అవినీతి రహిత్ భారత్ అన్న ఇతివృత్తంగా నిర్ణయించింది.

రైల్వే బోర్డు ( ఆపరేషన్స్‌ఢ బిజినెస్ డెవలప్ మెంట్) సభ్యుడు శ్రీ ఎస్.కె. మొహంతి ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 31 అక్టోబర్, 2022న రైల్వే సిబ్బంది, అధికారుల చేత ప్రతిగ్న చేయించారు.

ఇటువంటి కార్యక్రమాలే వివిధ జోనల్ రైల్వే కేంద్ర కార్యాలయంలో, భారతీయ రైల్వేలకు చెందిన ఇతర కార్యాలయాల్లో కార్యాలయ అధిపతులు ప్రతిగ్న చేయించారు. తమ కార్యకలాపాలకు సంబంధించిన అన్ని రంగాలలో సమగ్రత, పారదర్శకతను సాధించేందుకు, అవినీతిని శక్తివంతంగా ఎదుర్కోవడానికి అధికారుల నిబద్ధతను బలోపేతం చేయడం ఈ ప్రతిజ్ఞ లక్ష్యం. రైల్వేబోర్డు అధికారులు, సిబ్బంది చేత 31-10-2022న విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయిస్తున్న రైల్వే బోర్డు (ఆపరేషన్స్ ఢ బిజినెస్ డెవలప్ మెంట్) సభ్యుడు శ్రీ ఎస్.కె. మొహంతి.

# డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన

**- ప్రతి నెల ఒకటో తేదీన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం: ఎస్పీ డా.వినీత్ .జి**



భద్రాద్రికొత్తగూడెం, నవంబర్ 1 (నేటినిజం ప్రతినిధి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ డా.వినీత్.జి డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. మొదటిసారిగా చేపట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 నుండి గంటపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి మొత్తం 19 ఫిర్యాదులు/సమస్యలను స్వీకరించడం జరిగిందని తెలిపారు. బాధితుల సమస్యల పరిష్కారం కొరకు వెంటనే అధికారులు చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ సమయంలో ఫోన్ ద్వారా తమ సమస్యలను తెలుసుకోలేని బాధితులు ఎస్పీ కార్యాలయానికి వచ్చి నేరుగా తమని సంప్రదించవచ్చని కోరారు. ఇక నుండి ప్రతి నెల ఒకటో తేదీన ఈ "డయల్ యువర్ ఎస్పీ"కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

# ప్రజా శ్రేయస్సే ముఖ్యమంత్రి ధ్యేయం... ఈదురు ఐలయ్య



మహబూబాబాద్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖ మంత్రి సహకారంతో పెద్దవంగర మండల టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పడమటి తండా కు చెందిన ధరవత్ బిక్న కు 42500 రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఈదురు అయిలయ్య పంపిణీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆరోగ్య ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇస్తున్న ఘనత ముఖ్య మంత్రి కెసిఆర్ దేనని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, పడమటి తండా సర్పంచ్ ధరావత్ రాజేందర్,మండల అధికార ప్రతినిధి బానోత్ సోమన్న,పడమటి తండా పార్టీ అధ్యక్షులు ధరావత్ బుజ్జమ్మ, పెద్దవంగర విద్య కమిటీ చైర్మన్ సుంకరి అంజయ్య, బానోత్ మైబు, రాయారపు స్వామి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలోని అన్నదాన భవనంలో పేలిన బాయిలర్



అమరావతి: నవంబర్ 1:శ్రీశైలంలోని అన్నదాన భవన సముదాయంలో పెను ప్రమాదం తప్పింది.దాంతో సిబ్బంది భయాందోళనకు గురైయ్యారు.శ్రీశైల దేవస్థానంలో అన్నదాన భవనంలో బాయిలర్ పేలింది .అన్న వండేందుకు ముందిగా వాటర్ ను స్ట్రీమింగ్ చేస్తారు.వాటర్ స్ట్రీమ్ అయ్యే బాయిలర్ పేలిపోయింది.అదృష్టవ శాత్తూ ఎవ్వరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలిస్తున్నారు అధికారులు.ప్రమాదం జరగటానికి కారణాలు తెలియాల్సి ఉంది.

# తిరుపతిలో దారుణ హత్య.. స్వల్ప ఘర్షణకే గొంతుకోసి చంపేశారు

తిరుపతి, నవంబర్ 1: తిరుపతి జిల్లా కేంద్రంలో దారుణం జరిగింది. ఓ వ్యక్తిని గొంతుకోసి చంపేసిన ఘటన ఇవ్వాల (సోమవారం) రాత్రి జరిగింది. ఈస్ట్ సీఐ శివప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలమేరకు.. గ్రూప్ థియేటర్ సమీపంలో పండు (35) అనే వ్యక్తిని అతి దారుణంగా గొంతు కోసి చంపేశారు.

సంవత్సర కాలంగా పలు చోట్ల పని చేసుకుంటూ.. సాయంత్రం అయితే మడత మంచాల వద్ద నిద్రిస్తూ ఉండేవాడు.

మత్తుకు బానిసై గంజాయి, మద్యం సేవిస్తూ ఉండేవాడు. మద్యం మత్తులో కొంతమందితో జరిగిన ఘర్షణలో మాట మాట పెరిగి గొంతు కోసి చంపేసినట్టు తెలుస్తోంది.

ఈ మర్డర్ సమాచారం రావడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని , సమీప ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని, నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

# ప్రత్యేక కార్యక్రమం 2.0 అమలు ద్వారా రైల్వే మంత్రిత్వ శాఖ అమలు చేసిన ఉత్తమ విధానాలు, సాధించిన విజయాలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి పెండింగ్‌లో ఉన్న సూచనలను పరిష్కరించాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు 2021 సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో రైల్వే మంత్రిత్వ శాఖ ప్రత్యేక ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించింది. పరిశుభ్రత, పెండింగ్‌లో ఉన్నప్రజా సమస్యల పరిష్కారం, పనితీరు మెరుగు పరచడం లక్ష్యంగా కార్యక్రమాలు అమలు జరిగాయి. దీనికి కొనసాగింపుగా రైల్వే మంత్రిత్వ శాఖ 02.10.2022 నుంచి 31.10.22 వరకు ప్రత్యేక ప్రచారం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించింది. దేశంలో అన్ని ప్రాంతాల్లో ఉన్న రైల్వే కార్యాలయాలు,ప్రాంగణాలు, రైల్వే స్టేషన్లలో పరిశుభ్రత కార్యక్రమాలు, సుపరిపాలనకు ప్రత్యేక ప్రచారం 2.0లో ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

దేశంలో అన్ని ప్రాంతాలకు రైల్వే వ్యవస్థ విస్తరించి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ప్రచారం 2.0 పరిధి విస్తరించిన రైల్వే మంత్రిత్వ శాఖ లక్ష్యాలను నిర్ణయించుకుంది. దేశంలో 7337 రైల్వే స్టేషన్ లలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ కార్యక్రమాలు అమలు జరిగాయి. ఒక విధంగా చూస్తే ఈ కార్యక్రమం క్లిష్టంగా వుంటుంది. అయితే, లక్ష్యాల మేరకు మంత్రిత్వ శాఖ పనిచేసి విజయం సాధించింది. స్టేషన్లను శుభ్రపరిచే కార్యక్రమాన్ని యాంత్రికరణ చేయడం, రైళ్ల పరిశుభ్రత, ప్రధాన స్టేషన్‌లకు చేరుకునే మార్గాలను శుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలు సేకరించి సురక్షితంగా తొలగించడం వంటి కార్యక్రమాలు అమలు చేయడం ఒక పెద్ద పనిగా ఉంటుంది.లక్ష్య సాధన కోసం . బెంగళూరు రైల్వే స్టేషన్ అమలు చేసిన చర్యలను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

అక్టోబర్ 2 నుంచి రైల్వే మంత్రిత్వ శాఖ అన్ని స్టేషన్లు, కార్యాలయాలు, వర్క్‌షాప్‌లు, ఉత్పత్తి యూనిట్లు మరియు ఇతర కార్యాలయాల్లో పరిశుభ్రతపై 9000 కంటే ఎక్కువ ప్రచార కార్యక్రమాలు నిర్వహించింది. ఈ విషయంలో రైల్వే మంత్రిత్వ శాఖ ఇప్పటికే 100% లక్ష్యం సాధించింది. ఒక లక్షా ఎనభై ఆరు వేలకు పైగా భౌతిక ఫైళ్లు మరియు దాదాపు 30000 ఈ-ఫైళ్లను సమీక్షించింది. విఐపి /ఎంపీ/ ఎమ్మెల్యేలు, పార్లమెంట్ , రాష్ట్ర ప్రభుత్వం/పీఎంఓ రిఫరెన్స్‌లు/ప్రజా ఫిర్యాదులు మరియు అప్పీళ్లతో సహా పెండింగ్‌లో ఉన్న అంశలను అంశాలను పరిశీలించడంలో పై నుండి కింది వరకు ఉన్న ఉద్యోగులందరూ చురుకుగా పాల్గొన్నారు. వివిధ పరిమితులకు లోబడి ఇప్పటికే 80% పైగా పరిష్కరించడం జరిగింది. . ప్రత్యేక ప్రచారం 2.0 చివరి రోజున రైల్వే మంత్రిత్వ శాఖ విఐపిల నుంచి అందిన 3000 సిఫార్సులు, రాష్ట్రాల నుంచి అందిన 160 సిఫార్సులు, 2.6 లక్షలకు పైగా ప్రజా ఫిర్యాదులను రైల్వే మంత్రిత్వ శాఖ పరిష్కరించింది. కార్యక్రమం అమలు జరుగుతున్న తీరును సీనియర్ అధికారులు ప్రత్యేకంగా సమీక్షించారు. కార్యక్రమంపై అవగాహన కల్పించి సిబ్బందికి అవగాహన కల్పించే కార్యక్రమాలను అధికారులు అమలు చేశారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా కార్యాలయాల నుంచి దాదాపు 33 కోట్ల రూపాయల విలువ చేసే వ్యర్థాలు తొలగించి 16000 చదరపు అడుగుల స్థలం వినియోగంలో తీసుకు రావడం జరిగింది.

ప్రత్యేక కార్యక్రమం 2.0లో భాగంగా "నుక్కడ్‌నాటక్" (వీధి ప్రదర్శనలు)తో సహా అనేక అవగాహన కార్యక్రమాలు అమలు జరిగాయి. వీటివల్ల సిబ్బంది, ప్రజలు పరిశుభ్రతపై అవగాహన పెరిగింది. కార్యక్రమాలు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు పొందాయి.

ఈ ప్రచారంలో అనేక ఇతర కార్యక్రమాలు కూడా అమలు జరిగాయి. విఐపి(ఎంపీ/ఎమ్మెల్యే) నుంచి అందే సిఫార్సులు, పార్లమెంటులో జీరో అవర్‌లో లేవనెత్తిన అంశాలు, పార్లమెంటులో సెక్షన్ 377 కింద లేవనెత్తిన అంశాలను ఆన్‌లైన్ లో పరిశీలించి పరిష్కరించడానికి ఐటీ విధానానికి రూపకల్పన జరిగింది.

రియల్ టైమ్ మానిటరింగ్ మరియు విఐపి రిఫరెన్స్‌ల పరిష్కారం కోసం దేశీయంగా అభివృద్ధి చేయబడిన ఐటీ విధానం అమలు జరుగుతుంది. అప్లికేషన్ రిఫరెన్స్ నమోదు (అప్‌లోడ్ చేయడం), యూనిట్/ఆఫీసర్లకి మార్కింగ్/పంపడం, వారి నుంచి వచ్చిన ప్రత్యుత్తరాల నమోదు , సంబంధిత యూనిట్ వారీగా ప్రాసెస్ చేయడం, రైల్వే మంత్రి/రైల్వే శాఖ సహాయ మంత్రి /జీఎం /డీఆర్‌ఎం లతో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించడం లాంటి కార్యక్రమాల నిర్వహణకు ఐటీ వ్యవస్థ ఉపయోగపడుతుంది. సమస్యల స్థితి విషయం/ విఐపి /రాష్ట్రం / యూనిట్( డైరెక్టరేట్/జోనల్ రైల్వే మొదలైనవి)/సమయ వ్యవధి అంశాలపై ఓమా నివేదికలను వ్యవస్థ సిద్ధం చేస్తుంది. ఈ వ్యవస్థ సంబంధిత అధికారులకు ఇ-మెయిల్ మరియు [illegible] ద్వారా వారం వారం హెచ్చరికలను కూడా పంపుతుంది. కేవలం బటన్‌ను క్లిక్ చేయడం ద్వారా మంత్రి/అధికారులు నిర్దిష్ట ప్రజాప్రతినిధి నుంచి అందిన సమస్య, సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు పరిశీలించి నిర్ణయం తీసుకోవడానికి అవకాశం కలుగుతుంది.

పార్లమెంటరీ రిఫరెన్స్‌ల నిజ సమయ పర్యవేక్షణకు కోసం మరొక మాడ్యూల్ కూడా విఐపి సూచనల పర్యవేక్షణ కోసం నిర్మించిన ఓమా యొక్క అన్ని లక్షణాలతో అదే తరహాలో అభివృద్ధి చేయబడింది.

ఈ రెండు అప్లికేషన్‌ల అభివృద్ధితో సూచనలు, సిఫార్సులను రైల్వే మంత్రిత్వ శాఖ త్వరితగతిన పరిష్కరించ కలుగుతుంది. ఈ కార్యక్రమాల అమలుకు ప్రత్యేక ప్రచారం 2.0లో సహకరించింది.

ప్రజా ఫిర్యాదుల పర్యవేక్షణ కోసం 'రైల్ మదద్ పోర్టల్' ఉపయోగపడుతుంది. పరిష్కరించిన ఫిర్యాదులు, పరిష్కరించేందుకు తీసుకున్న సమయం పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పరిస్థితి లాంటి అంశాలను ఆన్‌లైన్‌లో 'రైల్ మదద్ పోర్టల్ 'పర్యవేక్షిస్తుంది.

రైల్వే బోర్డు కార్యాలయంలో ఈ-ఆఫీస్ వ్యవస్థ ద్వారా అన్ని వ్యాపార ప్రక్రియలు మరియు ఫైల్ వర్క్‌లను డిజిటలైజ్ చేయడం జరుగుతుంది. నవంబర్ 1 నుంచి పూర్తిగా కాగితారహిత పని ప్రారంభించాలని రైల్వే మంత్రిత్వ శాఖ నిర్ణయించింది.

నైరుతి రైల్వే పరిధిలో బెంగళూరు రైల్వే స్టేషన్ లో అమలు జరిగిన కృషిని ప్రధాన మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి ప్రశంసించారు.

# మోర్బీలో తాజా పరిస్థితిపై ప్రధాని ఉన్నతస్థాయి సమీక్ష



న్యూఢిల్లీ, అక్టోబర్ 31:మోర్బీలో తాజా పరిస్థితిపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ రాత్రి గాంధీనగర్ లోని రాజ్ భవన్లో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మోర్బీలో దురదృష్టకర దుర్ఘటన సంభవించగానే ప్రారంభించిన రక్షణ-సహాయ కార్యక్రమాలపై ఈ సందర్భంగా అధికారులు ప్రధానికి అన్ని వివరాలూ నివేదించారు.

ఈ విషాదానంతర అంశాలన్నిటిపైనా సమావేశం పూర్తిస్థాయిలో చర్చించింది.

తర్వాత ప్రధాని స్పందిస్తూ-బాధితులకు వీలైనంత మేరకు సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ భూపేంద్ర భాయ్ పటేల్, హోంశాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలతోపాటు రాష్ట్ర హోంశాఖ, విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు ఈ ఉన్నతస్థాయి సమీక్షలో పాల్గొన్నారు.

# ఏపీ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు..నవంబర్ 1న ఏపీ అవతరణ దినోత్సవంగా జీవో జారీ



అమరావతి: నవంబర్ 1:తాడేపల్లి సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. సీఎం జగన్ మంగళవారంనాడు తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి సీఎం జగన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం సీఎం జగన్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1వ తేదీ నుండి నిర్వహించాలని జగన్ సర్కార్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2020 లో ఏపీప్రభుత్వం జీవోను జారీ చేసింది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో నవంబర్ 1వ తేదీనఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాలు నిర్వహించేవారు. 2014లో ఉమ్మడి ఏపీ రాష్ట్రం ఏపీ, తెలంగాణ రాష్ట్రాలుగా విభజించారు. దీంతో ప్రతి ఏటా జూన్ రెండో తేదీన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని తెలంగాణలో నిర్వహిస్తున్నారు.అయితే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర అవతరణ దినోత్సవాలపై సందిగ్ధంలో పడింది. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో నిర్వహించినట్టుగానే నవంబర్1న ఏపీ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.

# స్టేషన్లలో ఉన్న వాహనాలను డాక్యుమెంట్స్ చూపించి తీసుకోగలరు... ఆర్ ఐ పూర్ణచందర్



మహబూబాబాద్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో తెలియని ఆస్తి (అన్నోన్ ప్రాపర్టీ ) కింద ఉన్న వాహనాలను గుర్తుపట్టిన యజమానులు సంబంధిత డాక్యుమెంట్స్ చూపించి తీసుకెళ్లాలని మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఆర్ ఐ (ఎం టి ఓ) పూర్ణ చందర్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పరిధిలో తెలియని ఆస్తి (అన్నోన్ ప్రాపర్టీ )కింద నమోదైన 47 వాహనాలను పోలీస్ హెడ్ క్వార్టర్లో భద్రపరచినట్టు ఆర్ ఐ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ శాఖ అధికారిక వెబ్ సైట్, ఫేసుబుక్, ట్విట్టర్ లలో వాహనాల వివరాలు పొందుపరిచామని అన్నారు. వాహనాల యజమానులు ఆరు నెలల్లోగా ధృవ పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలని అన్నారు. ఆరు నెలల తర్వాత అన్నోన్ ప్రాపర్టీ కింద పరిగణించి ఎవరికి సంబంధం లేని వాహనంగా ధృవీకరించి జిల్లా నోడల్ కమిటీ ద్వారా వేలం వేయడం జరుగుతుందన్నారు. ఇంకా ఇతర వివరాలకు ఆర్.ఐ పూర్ణచందర్( ఫోన్ నంబర్ 8712656916 ) సంప్రదించాలన్నారు.

# రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పునరంకితమవుదాం.. సీఎం జగన్



అమరావతి: నవంబర్ 1:మన సంస్కృతిని, మన కీర్తిని, మన పూర్వీకుల పోరాటాలను, విజయాలను, ఈ నేలపై జన్మించిన ఎందరో మహానుభావుల త్యాగాలను ఘనంగా స్మరించుకునే పండుగ రోజు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం అని సీఎం జగన్ అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పునరంకితమవుదాం అని ఆయన ట్వీట్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన వేడుకల్లో సీఎం పాల్గొన్నారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. తెలుగుతల్లి, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాల పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి రోజా సహా పలువురు మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.

# గుంతలో జారి పడ్డా వైసీపీ కార్పొరేటర్ బాషా



అమరావతి: నవంబర్ 1:గుంటూరు తూర్పు వైసీపీ 11వ వార్డు కార్పొరేటర్ బాషా పొన్నూరు రోడ్డు మీదగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుంతలో జారిపడ్డారు తెల్లవారుజాము సమయం కాబట్టి వాహనాల రద్దీ లేక పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్న అధికారులు, పాలకులు, రోడ్డు మరమ్మతుల గురించి పట్టించుకోకపోవడం గమనార్హం కార్పొరేటర్ కి పట్టిన పరిస్థితి ఇతర ప్రజలకు పడకుండ తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులను డిమాండ్ చేస్తున్న స్థానికులు




## రాహుల్ గాంధీని కలిసిన రాధిక వేముల..న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అగ్రనేత



హైదరాబాద్, నవంబర్ 1:భారత్ జోడో యాత్ర హైదరాబాద్ కి చేరుకుంది. వేలాది మంది అభిమానులు, కాంగ్రెస్ శ్రేణుల మధ్య కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాదయాత్ర కొనసాగుతోంది. ఈ సందర్భంగా హైదారాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధిక వేముల రాహుల్ ని కలిసి ఆయనకు సంఘీభావాన్ని ప్రకటించారు. రోహిత్ వేముల ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే.

ఆయన ఆత్మహత్య దేశవ్యాప్తంగా ప్రకంపనలు పుట్టించింది. ఆ సమయంలో రాహుల్ గాంధీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి కూడా వచ్చారు. ఈరోజు తనను కలిసిన రోహిత్ తల్లిని రాహుల్ ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు. రాహుల్ తో కలిసి రాధిక పాదయాత్రలో నడిచారు. బీజేపీ, ఆరెస్సెస్ నుంచి మన రాజ్యాంగాన్ని రక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ ను ఆమె కోరారు. మరోవైపు మీకు పూర్తి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా ఆమెకు రాహుల్ హామీ ఇచ్చారు. రాహుల్ తో రోహిత్ తల్లి కలిసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## అనంతలోకాలకు మావో అగ్రనేతల మాతృమూర్తి..

కరీంనగర్, నవంబర్ 1: ఏ క్షణంలో తనువు చాలిస్తానో తెలియదు.. నాకు 100 ఏళ్ల వయసు.. నీకు 70 ఏళ్లు ఉంటాయి.. కడుపు చించుకొని పుట్టిన నువ్వు కంట కనబడకుండా పోయి 45 ఏళ్లు దాటిపోయాయి.. చిన్నపుడు నా దగ్గర పెరిగినపుడు నీ జ్ఞాపకాలే తప్ప మరేమీ నా వద్ద లేవు.. ఇప్పుడు నీ రూపం ఎలా ఉందో కూడా నాకు తెలియదు.. నీ ఆరోగ్య పరిస్థితి అసలే తెలియదు.. వందేళ్లు వచ్చినా నీ జ్ఞాపకాలను మదిలో ఉంచుకొని ఇన్నాళ్లు బతికాను.. నీకన్నా ముందుగా అడవికి వెళ్లిన నీ అన్న విగతజీవిగా 11 ఏళ్ల కిందట కనిపించి శోకసంద్రంలో ముంచాడు.. జీవితాంతం నాకు తోడుగా ఉంటానన్న మీ నాన్న 25 ఏళ్ల క్రితమే నన్ను వదిలివెళ్లాడు..

ఈ వయసులో బతకాలన్న కోరిక నాలో మిగిలి ఉందంటే అది నిన్ను చూడడమే.. నా కౌగిలిలో అక్కున చేర్చుకొని తనివి తీరా ఆనందించడం కోసమే.. నేను కన్ను మూసే నాటికైనా నిన్ను సజీవంగా చూడాలన్న ఈ తల్లి కోరిక మన్నించు.. ప్రపంచమంతా ధనిక, పేద తేడా లేకుండా కరోనా మహమ్మారితో అల్లాడి పోతున్నారు.. ఈ క్షణంలోనైనా నువ్వు లొంగిపోతే నీకు సర్కారు అన్ని రకాల సాయం చెస్తుంది.. వైద్యం అందిస్తుంది.. అంతకు మించి నా కొడుకును నా కళ్ల ముందు ఉంచినట్లవుతుంది.. ఇది దాదాపు 50 ఏళ్ల క్రితం ఉద్యమం పేరిట మావోయిస్టుల్లో కలిసిన అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్‌రావు తల్లి మధురమ్మ తుది శ్వాస విడిచే వరకు పడిన కొడుకు కోసం పడిన తపన..

కొడుకు కోసం తపిస్తూ చివరి కోరిక తీరకుండానే మావో అగ్రనేత తల్లి మధురమ్మ మంగళవారం అనంత లోకాలకు చేరుకుంది. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధురమ్మ ఆరోగ్య పరిస్థితి పూర్తిగా విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకు వెళ్లాలని సూచించడంతో బంధువులు మధురమ్మ స్వస్థలం పెద్దపల్లికి తరలించి, వెంటిలేటర్ తొలగించగానే మధురమ్మ తుదిశ్వాస విడిచారు. విగత జీవిగా మారిన మధురమ్మను చూసి ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు.

50 ఏళ్లుగా తల్లడిల్లిన మాతృమూర్తి..

1973లో మధురమ్మ రెండో కుమారుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు ఉద్యమ బాట పట్టగా, 1977లో చిన్న కుమారుడు వేణుగోపాల్‌రావు అడవిబాట పట్టి కనిపించకుండా పోయాడు. 1997లో తండ్రి మరణించినా వారు అంత్యక్రియలకు సైతం హాజరు కాలేదు. ఇల్లు విడిచిన నాటి నుంచి కనిపెంచిన కొడుకులు కనిపించకుండా పోయారు. 2011లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్‌జీ మృతిచెంది విగతజీవిగా రావడంతో కన్న కడుపు తల్లడిల్లింది. కనీసం చిన్న కుమారుడు వేణుగోపాల్‌రావునైనా సజీవంగా చూడాలని ఆ తల్లి ప్రాణం ఎంతో పరితపించింది.

జీవిత చరమాంకంలోనైనా నువ్వు ఉద్యమాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలుస్తావని పలుమార్లు వేణుగోపాల్‌రావును ఉద్దేశిస్తూ తల్లి మధురమ్మ విడియాతో తన చివరి కోరికను పంచుకుంది. చివరి రోజులలోనైనా తనతోపాటు కుటుంబ సభ్యులతో హాయిగా ఉండాలని కోరుకుంది. కని పెంచిన తల్లి రుణం తీర్చుకునేందుకైనా చివరి కోరిక మన్నించి అడవి బాట వీడి జనం బాట పట్టాలని మధురమ్మ ఎన్నోసార్లు కన్నీటి పర్యంతమైంది. అయితే చివరికి తన ఆశ తీరకుండానే మధురమ్మ తుదిశ్వాస విడవడం పలువురిని కంటి తడి పెట్టించింది.

## మునుగోడులో తొలిసారి ఓటేయనున్న 8,432 మంది యువత

హైదరాబాద్, నవంబర్ 1:దేశమంతా ఆశక్తితో గమనిస్తున్న మునుగోడు ఉప ఎన్నిక ప్రచారం తారాస్థాయికి చేరి పోలింగ్‌కు చేరువైంది. నవంబర్ 3న జరగనున్న ఉప ఎన్నికల పోలింగ్‌లో ఎంత ఎక్కువ శాతం ఓటింగ్ నమోదైతే అంత లాభమనే కోణంలో ఎవరికి వారుగా పార్టీలు, అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉండగా, ఓటర్లు మాత్రం గుంభనంగా వ్యవహరిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,855 మందికాగా, ఇందులో పురుష ఓటర్లు 1,21,662 మంది, మహిళా ఓటర్లు 1,20,126 మంది, థర్డ్ జెండర్ 7 ఓట్లు ఉన్నాయి. ఎన్నారై ఓటర్లు పురుషులు 10 మంది ఉన్నారు.

ఈ నియోజకవర్గంలో 48మంది పురుష సర్వీస్ ఓటర్లు, ఇద్దరు మహిళా సర్వీస్ ఓటర్లు ఉన్నారు. వీరు నవంబర్ 3న నేతల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. కాగా కులాల వారీగా తీవ్ర చర్చకు నిలయంగా మారిన మునుగోడులో 80ఏళ్లకు పైబడిన సీనియర్ ఓటర్లు 2576, దివ్యాంగ ఓటర్లు 5686 మంది ఉన్నారు. 18నుంచి 19ఏళ్ల మధ్య వయసులోని నూతన ఓటర్లు 8432 మంది తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇక 20నుంచి 21ఏళ్ల నడుమ వయసున్న ఓటర్లు 8472 మంది, 22నుంచి 25ఏళ్ల మధ్యలో 20,472 మంది ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న పరిస్థితి నెలకొంది.

ఇక 31నుంచి 40ఏళ్ల మధ్య వయస్కు ఓటర్లు 64,721 మంది, 41నుంచి 50ఏళ్ల మధ్య వయసులోని 47,430మంది ఓటర్లు నేతల తలరాతలను మార్చేందుకు నియోజక వర్గంలో ఎదురు చూస్తున్న పరిస్థితి ఉంది. ఇక 51నుంచి 60ఏళ్ల మధ్యలో 32,120మంది, 61నుంచి 70ఏళ్ల మధ్యలో 19,655మంది, 71నుంచి 80ఏళ్ల నడుమ 9723 మంది ఓటర్లున్నారు. అర్బన్ ప్రాంతాల్లో 35 పోలింగ్ కేంద్రాలుండగా, రూరల్ ఏరియాల్లో 263 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. మునుగోడు ఎన్నికలు మొదటి నుంచీ అత్యంత హీట్‌ను రేకెత్తించి ప్రధాన పార్టీలన్నీ ప్రతిష్టగా తీసుకొని ప్రచారం చేశాయి. ఈ ఎన్నికల ప్రచారంలో జాతీయస్థాయి అంశాలతోపాటు, రాష్ట్ర సమస్యలు, హామీలను అన్ని పార్టీలు ప్రజలకు గుర్తుచేస్తూ ముందుకుసాగాయి.

ఇక సోషల్ మీడియాలోనూ ప్రచారానికి పెద్దగా ప్రాధాన్యత కల్పిస్తూ పార్టీలు జోరుగా ముందుకు సాగాయి. ప్రచారాన్ని ప్రతి క్షణం సోషల్ మీడియా గ్రూపుల్లో పోస్టులు చేసి అన్ని వయసుల వారికి చేరేలా, వారిని ఆకర్శించేలా చర్యలు తీసుకున్నారు. అన్ని వయసుల వారి ఆదరణ పొందేలా పార్టీలన్ని పక్కా ప్రణాళికలతో ప్రచారం పూర్తి చేశాయి. ఇక ఏజ్ గ్రూపుల వారీగా ఓటర్లు పార్టీల ప్రచారంతో ఎంత మేర ప్రభావితమయ్యారో ఈనెల 3న జరిగే పోలింగ్ తర్వాతే వెల్లడి కానుంది.

# అహ్మదాబాద్‌లోని అసర్వాలో రూ.2900 కోట్లకుపైగా విలువైన రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేసిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, నవంబర్ 1: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ అహ్మదాబాద్ లోని అసర్వాలో రూ.2,900 కోట్లకుపైగా విలువైన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ– గుజరాత్ అభివృద్ధి, అనుసంధానంలో ఇదొక విశిష్ట దినమని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాలకు బ్రాడ్ గేజ్ రైలు మార్గం అందుబాటులో లేదని ప్రధాని అన్నారు. దీనివల్ల ఇబ్బంది పడుతున్న లక్షలాది ప్రజలకు నేటినుంచి ఉపశమనం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బ్రాడ్ గేజ్ రైలు మార్గాన్ని జాతికి అంకితం చేసే అవకాశం ఇవాళ తనకు లభించిందంటూ ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. అసర్వా నుంచి హిమ్మత్‌నగర్ మీదుగా ఉదయపూర్ వరకుగల మీటర్ గేజ్ మార్గం మొత్తాన్నీ బ్రాడ్ గేజ్‌గా మార్చామని ప్రధాని గుర్తుచేశారు. దీంతో గుజరాత్‌లోని ఈ ప్రాంతం ఇక పొరుగు రాష్ట్రం రాజస్థాన్‌తోపాటు దేశం మొత్తంతో నేరుగా అనుసంధానం కాగలదని ఆయన తెలిపారు. లునిధార్–జెటల్‌సర్ మధ్య ఈ గేజ్ మార్పితో ఈ ప్రాంతంలో రైల్వే అనుసంధానాన్ని సులభం చేస్తుందని చెప్పారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి బయల్దేరే రైళ్లు దేశంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లగలవని వివరించారు.

ప్రధానమంత్రి తన ప్రసంగం కొనసాగిస్తూ– ''మీటర్ గేజ్ రైలుమార్గాన్ని బ్రాడ్ గేజ్‌కి మార్చినపుడు అది కొత్త అవకాశాలను కూడా తెస్తుంది'' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అసర్వా నుంచి ఉదయ్‌పూర్ దాకా 300 కిలోమీటర్ల మార్గం గేజ్ మార్పిడితో గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాలు ఇకపై ఢిల్లీ సహా ఉత్తర భారతంతో సంధానం కాగలవని ఆయన తెలిపారు. అలాగే అహ్మదాబాద్–ఢిల్లీ మధ్య ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. అంతేకాకుండా కచ్, ఉదయపూర్ పర్యాటక ప్రదేశాలు నేరుగా రైలు మార్గంతో అనుసంధానం సాధ్యమైందని పేర్కొన్నారు. దీనివల్ల ఈ రెండు ప్రాంతాలతోపాటు చితోడ్‌గఢ్, నాథ్ ద్వారా పర్యాటక ప్రదేశాలకూ సందర్శకుల రాక పెరుగుతుందన్నారు. ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్ వంటి పెద్ద పారిశ్రామిక నగరాలతో అనుసంధానంతో ఈ ప్రాంతంలోని వ్యాపారులు కూడా లబ్ధి పొందుతారని ప్రధాని తెలిపారు. ''ముఖ్యంగా హిమ్మత్ నగర్ టైల్స్ పరిశ్రమకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది'' అన్నారు. అలాగే లునిధర్–జెటల్సర్ మధ్య బ్రాడ్ గేజికి మార్పిడి వల్ల ధసా–జెటల్‌సర్ సెక్షన్ పూర్తిగా బ్రాడ్ గేజ్ మార్గంగా మారిందని పేర్కొన్నారు. ఈ మార్గం బోటాడ్, అమ్రేలి, రాజ్‌కోట్ జిల్లాల గుండా వెళుతుందని, ఇప్పటిదాకా ఈ ప్రాంతాలకు రైలు అనుసంధానం పరిమితంగానే ఉందని తెలిపారు. మరోవైపు ఈ మార్గంలో పనులు పూర్తయినందున భావనగర్, అమ్రేలి ప్రాంత ప్రజలు సోమనాథ్, పోర్‌బందర్‌లతో నేరుగా అనుసంధానం కాగలరని ప్రధానమంత్రి వెల్లడించారు.

ఈ మార్గం వల్ల భావ్‌నగర్–వెరావల్ మధ్య దూరం 470 కిలోమీటర్ల నుంచి దాదాపు 290 కిలోమీటర్ల కన్నా తక్కువ అవుతుందని ఆయన తెలిపారు. తద్వారా ప్రయాణ సమయం 12 గంటల నుంచి కేవలం 6.5 గంటలకు తగ్గుతుందని ప్రధాని పేర్కొన్నారు. అంతేగాక భావ్‌నగర్–పోర్‌బందర్ మధ్య దాదాపు 200 కిలోమీటర్ల మేర, భావ్‌నగర్–రాజ్‌కోట్ మధ్య దాదాపు 30 కిలోమీటర్ల మేర దూరం తగ్గిపోయిందన్నారు. బ్రాడ్ గేజ్ మార్గంలో నడిచే రైళ్లు గుజరాత్‌లో పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేస్తాయని ప్రధాని అన్నారు. అలాగే పర్యాటకాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవడమేగాక తెగిపోయిన ప్రాంతాలను కలుపుతాయని ఆయన చెప్పారు. "సమైక్యతా దినోత్సవం నేపథ్యంలో ఇవాళ ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేయడం మరింత విశేషం" అని ఈ సందర్భంగా ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. "రెండు ఇంజన్ల ప్రభుత్వం కృషి ప్రభావం రెట్టింపుతో పరిమితం కాదు... అది అనేక రెట్లుగా ఉంటుంది. ఆ మేరకు 1+1 అంటే 2 కాదు... 11" అని అర్థం అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. ''రెండు ఇంజన్ల ప్రభుత్వంతో గుజరాత్‌లో పని వేగం పెరగడమేగాక దాన్ని మరింత విస్తరించగల శక్తి సమకూరింది" అన్నారు. రాష్ట్రంలో 2009–2014 మధ్య రెండు వరుసల రైలు మార్గాల అభివృద్ధి 125 కిలోమీటర్లకన్నా తక్కువకు పరిమితమైందని ప్రధాని గుర్తుచేశారు. అయితే, 2014–2022 మధ్య 550 కిలోమీటర్లకు పైగా పూర్తయిందని ఆయన పేర్కొన్నారు. అలాగే 2009–2014 మధ్య గుజరాత్‌లో రైలు మార్గం విద్యుదీకరణ కేవలం 60 కిలోమీటర్లకు పరిమితం కాగా, 2014–2022 మధ్య 1700 కిలోమీటర్లకుపైగా పూర్తయినట్లు వివరించారు.

రైలు మార్గాల పరిమాణం, పనుల వేగం పెంపుతోపాటు నాణ్యత, సౌలభ్యం, భద్రత, పరిశుభ్రత కూడా మెరుగవుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల పరిస్థితి మెరుగుపడటాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. "ఒకప్పుడు సంపన్నులకు మాత్రమే పరిమితమైన సౌకర్యాలు, పర్యావరణం ఇప్పుడు పేద–మధ్య తరగతి వర్గాలకూ అందుబాటులోకి వచ్చింది'' అని ప్రధాని తెలిపారు. "గాంధీనగర్ స్టేషన్ తరహాలోనే అహ్మదాబాద్, సూరత్, ఉద్నా, సబర్మతి, సోమనాథ్, న్యూ భుజ్ రైల్వే స్టేషన్లు కూడా అభివృద్ధి చేయబడుతున్నాయి" అని పేర్కొన్నారు. రెండు ఇంజన్ల ప్రభుత్వం వల్లనే ఈ విజయాలన్నీ సాధ్యమయ్యాయని స్పష్టం చేశారు. గాంధీనగర్– ముంబై మార్గంలో ప్రారంభించిన కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ఈ సందర్భంగా ప్రధాని ఉదాహరించారు. పశ్చిమ రైల్వే అభివృద్ధికి కొత్త కోణం జోడించడానికి 12 గతిశక్తి సరకు రవాణా కూడళ్ల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించామని ప్రధానమంత్రి తెలిపారు. ''తొలి గతిశక్తి బహుళ–రవాణా సరకుల కూడలి వడోదర సర్కిల్‌లో ప్రారంభించబడింది. త్వరలోనే మిగిలినవి కూడా సేవలు అందించడానికి సిద్ధమవుతున్నాయి" అని ఆయన చెప్పారు.

"స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలు గడిచినా పేద–ధనిక వ్యత్యాసం, నగర–గ్రామీణ ప్రాంతాల మధ్య అగాధంతోపాటు అసమతుల అభివృద్ధి దేశానికి పెనుసవాలుగా మారాయి" అని ప్రధానమంత్రి అన్నారు. "ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి మా ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మధ్య తరగతి ప్రజలకు మౌలిక వసతులు, ఇతర సౌకర్యాల కల్పన ప్రాధాన్యాన్ని 'అందరికీ అభివృద్ధి' విధానం స్పష్టం చేస్తోంది" అని ప్రధాని చెప్పారు. మరోవైపు పేదరికంపై పోరులో పేదలకు ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు. తదనుగుణంగా "పేదలకు పక్కా ఇళ్లు,, మరుగుదొడ్లు, విద్యుత్తు, నీరు, వంటగ్యాస్, ఉచిత చికిత్స, బీమా రక్షణ వగైరాల రూపంలో కల్పించబడుతున్న సదుపాయాలు సుపరిపాలనకు తార్కాణాలు" అని ప్రధాని చెప్పారు. దేశంలో అనుసంధాన మౌలిక సదుపాయాల అభివృద్ధి సంబంధిత విధానంలో పెను మార్పు గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. ఒకప్పటి ప్రణాళికరహిత నిర్మాణాలకు బదులు రైలు, మెట్రో, బస్సు వగైరా సౌకర్యాల అనుసంధానానికి నేడు ఒక సమన్వయ విధానం ఉందని తెలిపారు. ఈ మేరకు ప్రయాణ మార్గాలు, ఉపకరణాల సమ్మేళనం లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఆయన చెప్పారు. గుజరాత్ పారిశ్రామిక స్వభావాన్ని నొక్కిచెబుతూ– రాష్ట్రంలోని ఓడరేవులకు సాధికారత లభిస్తే అది మొత్తం దేశ ఆర్థికవ్యవస్థపై నేరుగా ప్రభావం చూపగలదని ప్రధాని అన్నారు. "గత 8 ఏళ్లలో గుజరాత్ ఓడరేవుల సామర్థ్యం దాదాపు రెట్టింపైంది" అని ఆయన చెప్పారు. అభివృద్ధి ప్రక్రియ నిరంతరతను గుర్తుచేస్తూ– "ప్రగతిశీల భారతదేశం కోసం అభివృద్ధి చెందిన గుజరాత్ నిర్మాణమే మా నినాదం" అని ప్రధాని స్పష్టం చేశారు.

చివరగా– సర్దార్ పటేల్ జయంతి నేపథ్యంలో ప్రధానమంత్రి ఆయనను కొనియాడారు. భారతదేశ తొలి హోం మంత్రి సాధించిన విజయాలపై ప్రతి భారతీయుడూ గర్విస్తున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, కొన్ని గుజరాతీ పత్రికలకు రాజస్థాన్ ప్రభుత్వం ఇచ్చిన ప్రకటనలలో సర్దార్ పటేల్ పేరు, చిత్రం లేకపోవడాన్ని ప్రధాని ఈ సందర్భంగా తప్పుబట్టారు. "సర్దార్ పటేల్‌కు.. అందునా ఆయన పుట్టిన గడ్డమీద ఇటువంటి అవమానాన్ని గుజరాత్‌లో ఎన్నటికీ సహించలేం" అని శ్రీ మోదీ అన్నారు. "సర్దార్ పటేల్ తరహాలోనే మన రైల్వేలు భారతదేశాన్ని ఏకీకృతం చేస్తాయి. అంతేగాక ఈ ప్రక్రియ సరైన దిశలో.. వేగంగా ముందుకు సాగుతుంది" అంటూ ప్రధానమంత్రి తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్, సహాయ మంత్రి శ్రీమతి దర్శన జర్దోష్ సహా ఎంపీలు, రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ అహ్మదాబాద్‌లోని అసర్వాలో రూ.2900 కోట్లకుపైగా విలువైన రెండు రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. వీటిలో అహ్మదాబాద్ (అసర్వా)–హిమ్మత్‌నగర్–ఉదయ్‌పూర్ గేజ్ మార్పిడి మార్గంతోపాటు లునిధర్–జెటల్‌సర్ గేజ్ మార్పిడి మార్గం ఉన్నాయి. మరోవైపు భావ్‌నగర్–జెటల్సర్; అసర్వా–ఉదయ్‌పూర్ మార్గంలో కొత్త రైళ్లను ప్రధాని జెండా ఊపి ప్రారంభించారు. దేశవ్యాప్తంగా ఒకే గేజ్ రైలు మార్గాల వ్యవస్థ లక్ష్యంగా ఇతర గేజ్ మార్గాలను రైల్వేశాఖ బ్రాడ్ గేజికి మార్పు చేస్తోంది. ఇందులో భాగంగా గేజ్ మార్పిడి ప్రాజెక్టులు పూర్తికాగానే ప్రధానమంత్రి వాటిని జాతికి అంకితం చేస్తున్నారు. వీటిలో 300 కిలోమీటర్ల పొడవైన అహ్మదాబాద్ (అసర్వా)–హిమ్మత్‌నగర్–ఉదయ్‌పూర్ గేజ్ మార్పిడి మార్గం కూడా ఒకటి కాగా, ఇది అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తుంది. అలాగే ఈ ప్రాంతంలోని పర్యాటకులు, వ్యాపారులు, తయారీ కేంద్రాలు, పరిశ్రమలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అదేవిధంగా ఉపాధి అవకాశాలను పెంచటమేగాక ఈ ప్రాంత సామాజిక–ఆర్థిక అభివృద్ధికి దోహదం చేస్తుంది.

ఇక 58 కిలోమీటర్ల పొడవైన లూనిధర్–జెటల్‌సర్ గేజ్ మార్పిడి మార్గంతో వెరావల్– పోర్‌బందర్ నుంచి పిపావావ్ రేవు, భావ్‌నగర్‌లకు దూరం తగ్గుతుంది. అలాగే ఈ సెక్షన్లో సరకు రవాణా సామర్థ్యం పెరిగినందువల్ల కనాలస్–రాజ్‌కోట్–విరాంగం మార్గంలో రద్దీ తగ్గుతుంది. మరోవైపు గిర్ అభయారణ్యం, సోమనాథ ఆలయం, డయ్యూ, గిర్నార్ హిల్స్ ప్రాంతాలకు అనుసంధానాన్ని సాఫీగా మారుస్తుంది. తద్వారా ఈ ప్రాంతంలో పర్యాటక రంగానికి నూతనోత్తేజం లభిస్తుంది.

## రైతులకు లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డులు.. హాజరైన గవర్నర్ బిశ్వభూషణ్



అమరావతి: నవంబర్ 1: సామాన్యుల్లోని అసమాన్యుల సేవలను ప్రత్యేకంగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వైఎస్సార్ లైఫ్ టైం అచీవ్ మెంట్ అవార్డులను గర్వకారణంగా నిలుస్తాయని ఏపీ సీఎం జగన్ పేర్కొన్నారు. సమాజంలో అసమాన్య సేవలు అందిస్తున్న ప్రముఖులు, మానవతా మూర్తులకు అభినందనలు తెలిపారు. వరుసగా రెండో ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తరపున (వైఎస్సార్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్) అత్యున్నత అవార్డులను ప్రదానం చేశారు. ప్రత్యేక ఉన్నత పురస్కారాలను వ్యక్తులుగా, సంస్థలుగా వారు చేసిన గొప్ప సేవలకు గుర్తింపుగా ఇస్తున్నట్లు సీఎం జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా విజయవాడ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో గవర్నర్ ముఖ్య అతిథిగా జరిగిన వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, వైఎస్సార్ అచీవ్ మెంట్ ?2022 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో సీఎం జగన్ ప్రసంగిం చారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా వైఎస్ విజయమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన 35 మందికి (30 సంస్థలకు) గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్ తో కలిసి అవార్డులు ప్రదానం చేశారు. వ్యవసాయం, కళలు, సంస్కృతి, సాహిత్యం, మహిళా శిశు సాధికారత, విద్య, జర్నలిజం, వైద్యం, పరిశ్రమలు వంటి రంగాలలో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు 20 వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు, 10 వైఎస్సార్ అచీవ్ మెంట్ అవార్డులు అందజేశారు.

## ఈటల కాన్వాయ్ పై రాళ్ల దాడి..పలివెలలో ఉద్రిక్తత

హైదరాబాద్, నవంబర్ 1:బిజెపి నేత ఈటల కాన్వాయ్ పై రాళ్ల దాడి జరిగింది. దాంతో నల్గొండ మునుగోడు మండలం పలివెలలో ఉద్రిక్తత నెలకొంది.టీఆర్ ఎస్ ..బిజెపి కార్యకర్తలు పరస్పర దాడికి దిగారు. ఈ ఘటనలో ఈటల కారు ధ్వంసమయింది.కాగా టీఆర్ ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. అయితే ఇంత జరుగుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు ఈటెల. నేటితో మునుగోడు ఉప ఎన్నికల ప్రచారానికి ఆఖరు కావడంతో పలు పార్టీలు హోరా హోరీగా ప్రచారం చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.

## అనుమతులు లేకపోయినా.. అనంతగిరి అడవిలో నైట్ క్యాంపింగ్

హైదరాబాద్, నవంబర్ 1: అనంతగిరిలో నైట్ క్యాంపింగ్ పర్మిషన్ లేకపోయినా కొంతమంది ఇష్టమున్నట్టు వ్యవహరిస్తున్నారు. పోలీస్ , ఫారెస్ట్ శాఖలు రెండూ 24 గంటలు అనంతగిరిలో పనిచేసినా అసాంఘిక కార్యక్రమాలు ఆగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. పర్యాటకులు అడవి ప్రాంతంలో టెంట్లు వేసుకొని వుడ్ ఫైర్ పెట్టుకుంటున్నారు. దీనికి అక్కడ ఉన్న సిబ్బంది అలసత్వమా లేక.. మరేదైన కారణమా అన్నదానికి మాత్రం సమాధానం దొరకడం లేదు.

అనంతగిరి అడవీ ప్రాంతంలో క్యాంప్ ఫైర్ వంటి దృశ్యాలు చూసినవారు చాలా అనుమానాలు వ్యక్త పరుస్తున్నారు. నైట్ క్యాంపింగ్.. ట్రెక్కింగ్ అనుమతులు లేకున్నా కొంతమంది అదే పనిగా ఇక్కడే మకాం వేస్తున్నారు. ట్రెక్కింగ్‌కు అటవీ శాఖ అనుమతి కంపల్సరీ తీసుకోవాలి, కానీ.. కొందరు దూర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ హల్‌చల్ చేస్తున్నారు. రాత్రి సమయాల్లో కారులో వస్తున్న యువకులు పెద్ద పెద్ద సౌండ్స్‌తో పాటలు వింటూ హంగామా చేస్తున్నారు. ఇలాంటి వారిని కట్టడి చేస్తేనే అడవిలో ఉన్న మూగజీవాలకు ఇబ్బందికరంగా ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## యాదాద్రిలో బ్రేక్ దర్శనాలు

యాదాద్రి,నవంబర్ 1:యాదాద్రిలో బ్రేక్ దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో నిన్నటి నుంచి వీవీఐపీ, వీఐపీ బ్రేక్ దర్శనాలను ప్రవేశపెట్టారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు రెండు గంటలపాటు బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నట్టు ఆలయ ఈవో గీత తెలిపారు. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా రెండు దఫాలుగా 292 మంది భక్తులు ఈ టికెట్లు తీసుకున్నారని, వీటి ద్వారా రూ. 87,600 ఆదాయం సమకూరినట్టు చెప్పారు. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా యాదాద్రి నిన్న భక్తులతో కిటకిటలాడింది. 354 జంటలు సత్యనారాయణస్వామి వ్రతాల్లో పాల్గొన్నాయి. వీటి ద్వారా రూ. 2,83,200 ఆదాయం ఆలయానికి సమకూరింది. కాగా, సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఈ నెల 8న యాదాద్రిలోని ప్రధాన, అనుబంధ ఆలయాలను మూసివేయనున్నారు. ఆ రోజున ఉదయం 8.15 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ద్వారబంధనం జరుగుతుందని ఈవో గీత తెలిపారు.

## డాక్టరేట్ పొందిన ఝాన్సీలక్ష్మి




ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): యోగా గురువు లేడిబోయిన ఝాన్సీలక్ష్మికి ది అమెరికన్ యూనివర్సిటీ యుఎస్ఏ (ఏయుజిపి) యోగా సైన్సులో డాక్టరేట్ ప్రధానం చేశారు.

చెన్నైలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ మధు క్రిషన్ చేతుల మీదుగా డాక్టరేట్ ఇవ్వడం జరిగింది. ఉన్నత విద్య మరియు యోగా రంగంలో చేసిన విశిష్ట సేవలు మరియు అనేక యోగా కార్యక్రమాలను గుర్తించి తనకు డాక్టరేట్ ప్రధానం చేసిన యూనివర్సిటీకి ఝాన్సీలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

## స్థానిక ప్రభుత్వ ఐ.టి.ఐ. లో వివిధ ట్రేడ్ లలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి గాను దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): స్థానిక ప్రభుత్వ ఐ.టి.ఐ. లో వివిధ ట్రేడ్ లలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఒక సంవత్సరం కాల వ్యవధి గల కంప్యూటర్ ట్రేడ్, డీజిల్ మెకానికల్ వృత్తుల నందు, అలాగే 2022–24 రెండు సంవత్సరాల కాలవ్యవధి గల డ్రాఫ్ట్ మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ వృత్తులందు మిగిలిపోయిన సీట్లలో ప్రవేశానికై పదవ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు తితితి.బివశ్రీజీనిణజీనిజీ.ఐనీల.తిని వెబ్ సైట్ నందు ఈ నెల 3 న ఉదయం 10 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇది వరకే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్ళీ నమోదు చేసుకోనవసారం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 3 న ఐ.టి.ఐ. నందు జరుగు స్పాట్ అడ్మిషన్ (వాక్ ఇన్ అడ్మిషన్) కు మధ్యాన్నం 2 గంటల లోపు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, జిరాక్స్ ప్రతులు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో హాజరు కావలసినదిగా ప్రిన్సిపాల్ సూచించారు.



# స్త్రీనిధి అధికారుల చేతివాటం నిరక్షరాస్యురాలిపై నెపం

ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా అర్బన్ మండలం పోలేపల్లి రాజీవ్ గృహకల్ప రాజీవ్ సమాఖ్య ద్వాక్రా సంఘాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలు వివాదాలు గత కొన్ని నెలలుగా పత్రికా ప్రకటనలతో 15 లక్షలు వాడుకుంది. అంటూ బాధితురాలి గృహములకు తాళాలు మహిళపై కుటుంబ సభ్యులపై దాడులు అధికారులు చోద్యం పలు అంశాలు సంఘటనలు తెలిసినవే. ఇదే సంఘటన పై ఆరోపణలు ఎదుర్కొంటున్న రేణుక మంగళవారం జిల్లా కలెక్టర్ కి ఈ పైసలు మతలబులో గతంలో వీధులు నిర్వహించిన గత సిసిలు పంబా శ్రీనివాస్, మరియు సంపత్ కుమార్, అను వీరు నన్ను మోసం చేసి చెక్కులు ప్రాంసరి నోట్లు ఇచ్చి ద్వాక్రా పైసలు వాడుకున్నారు.

పలు మార్లు మండల జిల్లా స్త్రీనిధి అధికారులకు పిర్యాదు చేసిన వారి సిబ్బందిని ఉద్యోగులను కాపాడుతూ నా ఇంటి పై దాడులు చేపిస్తూ నా పరువు తీశారు. అంటూ జిల్లా అధికారులకు పిర్యాదు చేసిన బాధితురాలు రేణుక.

ఇదే సంఘటన పై 2016 నుండీ 2022 వరకు గత మరియు ప్రస్తుత స్త్రీనిధి అధికారులను మా సమక్షంలో విచారించాలి అంటూ ,,మా రత్నమ్మ స్వచ్ఛంద సేవా సొసైటీ,, నిర్వాహకులు జాయింట్ కలెక్టర్ యమ్. మధుసూదన్ కి డిఆర్డివో ప్రాజెక్టు డైరెక్ట్ విధ్యా చందనకి మెమోరాండం అందించిన ఎన్జివో శ్రీనివాస్. ఇదే సంఘటనపై సిసి పంబా శ్రీనివాస్ ని వివరణ కోరగా పైసలు తీసుకున్న సంగతీ నిజమే వాస్తవమే కానీ వేరే విదంగా తీసుకున్నాము అంటూ వివరణ ఇచ్చారు.

ఇదే విషయమై సంపత్ కుమార్ ని వివరణ కోరగా నాకు ఈ సంఘటనకు ఎటువంటి సంబంధం లేదు అంటూ వివరణ ఇవ్వడం జరిగింది.

# సీఎం కేసీఆర్‌కు మునుగోడును కానుకగా అందిద్దాం : పట్నం నరేందర్‌రెడ్డి



కొడంగల్, నవంబర్ 1: మునుగోడు ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి ఘన విజయం ఖాయమని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం ఆయన చండూరు, నెర్మెట గ్రామాల్లో టీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా అందిద్దామని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఎంతగానో ఆకర్శిస్తున్నాయని వెల్లడించారు. నియోజక ఓటర్లు బంగారు తెలంగాణ సారథికే ఓటు వేయడానికి ఎంతో ఉత్సాహంగా సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# స్టీల్ మ్యాన్ ఆఫ్ ఇండియా.. జంషెడ్ ఇరానీ కన్నుమూత

రాంచీ, నవంబర్ 1: స్టీల్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన టాటా స్టీల్ మాజీ ఎండీ జంషెడ్ జే ఇరానీ (86) ఇక లేరు. జంషెడ్‌పూర్‌లోని టాటా మెయిన్ హాస్పిటల్‌లో సోమవారం అర్ధరాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య డైసీ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మరణంపై టాటా స్టీల్ సంతాపం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబానికి సానుభూతిని తెలుపుతూ ట్వీట్ చేసింది. జంషెడ్ ఇరానీ జూన్ 2011లో టాటా స్టీల్ బోర్డు నుంచి పదవీ విరమణ చేశారు. నాలుగు దశాబ్దాలకుపైగా భారతీయ పరిశ్రమకు, టాటాలకు విశేషమైన సేవలందించారు. ఆయన 1963లో బ్రిటిష్ ఐరన్ అండ్ స్టీల్ రీసెర్చ్ అసోసియేషన్, షెఫీల్డ్‌లో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు.

1968లో భారత్‌కు తిరిగి వచ్చిన తర్వాత, టాటా స్టీల్‌లో డైరెక్టర్ (ఖీడఅ)కి అసిస్టెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. 1979లో జనరల్ మేనేజర్‌గా, 1985లో ప్రెసిడెంట్‌గా నియామకమయ్యారు. 1992లో మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతలు చేపట్టి జూలై 2001 వరకు ఆ పదవిలో కొనసాగారు. నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి జియాలజీలో ఎంఎస్సీ, యూనివర్సిటీ ఆఫ్ షెఫీల్డ్ నుంచి డాక్టరేట్ సర్టిఫికేట్ పొందారు. ఆయనను భారత ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది. ఇరానీ మృతిపై జార్ఖండ్ ఆరోగ్యశాఖ మంత్రి బన్నా గుప్తా సంతాపం ప్రకటించారు. సమర్థుడైన గొప్ప నాయకుడిగా ఎప్పటికీ ఆయనను గుర్తుంచుకుంటారన్నారు.


ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు -2022!

కవి మిత్రులకు విజ్ఞప్తి

* 35 వ ' ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు_2022' కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము.

* అవార్డు పరిశీలన కోసం 2022 సం.లో ప్రచురింప బడిన కవితా సంపుటాలను మాత్రమే పంపుకోవాలి.

*ఎంపికైన అవార్డు విజేతకు 6000 రూ నగదు మరియు షీల్డ్ తో సత్కారం ఉంటుంది.

* 31.12.2022 తేదీ లోగా నాలుగు ప్రతులు ఈ చిరునామాకు పంపి సహకరించగలరు



డా. ఉమ్మడిశెట్టి రాధేయ,
( అవార్డు వ్యవస్థాపకులు )
13.1.606.1 షిర్డీ నగర్,
రెవిన్యూ కాలనీ
అనంతపురం- 515001
మొబైల్:9985171411


# ప్రతి నెల సివిల్ రైట్స్ డే నిర్వహించాలి...కలెక్టర్ శశాంక



మహబూబాబాద్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): ప్రతి నెలలో చివరి రోజు సివిల్ రైట్స్ డే ను తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్రతో కలిసి కేసుల పరిష్కారం అవగాహన వంటి కార్యక్రమాలపై నమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ చట్టంపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమా లను విస్తృతంగా చేపట్టాలన్నారు.

అందుకు ప్రతి నెలలో చివరి రోజు సివిల్ రైట్స్ నేను చేపట్టాలన్నారు.

షెడ్యూల్ కులాల షెడ్యూలు తెగల లబ్ధిదారులకు అమలు చేసే కళ్యాణ లక్ష్మి కులాంతర వివాహాలు వంటి పలు అభివృద్ధి పథకాల పురోగతిపై సమీక్షించుకోవాలని జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానంగా షెడ్యూలు జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల ను గుర్తించి సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు ప్రతి నెలలో కొన్ని గ్రామాల ఎంపిక చేసుకొని లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రగతి సాధించాలన్నారు ఎస్సీ ఎస్టీ చట్టంపై ప్రజల అవగాహన పెంచాలన్నారు.

అదేవిధంగా నష్టపరిహారం అందజేయుటంలో జాప్యం తగదన్నారు కేసులను కూడా సాధ్యమైనంత వరకు పరిష్కరించడం జరుగుతుందని అధికారులు నమన్వయంతో ముందుకు పోవాలన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి నన్యానయ్య ,కమిటీ నభ్యులు ,వ్యవసాయ శాఖ అధికారి చత్రు నాయక్ ,జిల్లా వైద్య శాఖ అధికారి హరీష్ రాజు, ఎస్సీ ఎస్టీ సెక్షన్ అధికారి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన ఉష్ణోగ్రతలు, పెరుగుతున్న చలి.. ఉదయం 9 గంటల దాకా బయటకు రాని జనాలు

హైదరాబాద్, నవంబర్ 1: శీతాకాలం ప్రారంభంలోనే హైదరాబాద్ మహానగరాన్ని చలి వణికిస్తుంది. అక్టోబర్ చివరి వారంలో మొదలైన చలి రోజు రోజుకు పెరుగుతుంది. గత 24, 25 తేదీలలో 14 డిగ్రీలకు చేరుకున్న ఉష్ణోగ్రతలు ప్రస్తుతం 16 , 17డిగ్రీల వద్ద స్థిరంగా ఉంటుంది. గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గి, చలి క్రమంగా పెరుగుతోంది. గరిష్టంగా 27 నుంచి 28 డిగ్రీలు, కనిష్టంగా 15 నుంచి 17 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో చలి పెరుగుతోంది. దీంతో ఉదయం పూట చలి ఎక్కువగా ఉంటోంది. ఉదయం 8నుంచి 9 గంటల వరకు జనాలు రోడ్లపైకి రావడానికి జంకుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గి పోవడం, చలి గాలులు వీస్తుండడంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణం మారడంతో చాలా మంది జ్వరం, నర్ధి, దగ్గుతో ఇబ్బందులు పడుతున్నారు. చలి గాలులు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రేటర్ పరిధిలో ఉష్ణోగ్రతలు తగ్గి.. చలి క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రత గరిష్ఠంగా 27 నుంచి 28 డిగ్రీల సెల్సియస్ , కనిష్ఠంగా దాదాపు 15 నుంచి 17 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడంతో నగరంలో రోజు రోజుకు చలి పెరుగుతోంది. మరోవైపు ఉదయం పూట సూర్యుడు సైతం కన్పించకపోవడంతో చలి ఎక్కువగా ఉంటోంది. దీంతో ఉదయం నడకకు వెళ్లే జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చలి గాలులకు తోడు మంగళవారం నగరంలో చిరు జల్లులు పడడంతో చలి మరింత పెరగవచ్చంటున్నారు. అక్టోబర్ మూడవ వారం వరకు వర్షాలు కురిశాయి. గత మూడు నాలుగు నెలల పాటు భారీ వర్షాలు పడిన సమయంలో కూడా చలి ప్రభావం కనిపించలేదు. అయితే ఒక్కసారి వాతావరణంలో మార్పు రావడంతో జనాల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు అంటున్నారు.

రానున్నరోజుల్లో పగటి ఉష్ణోగ్రతలుపెరిగి..రాత్రివేళ చలి అధికంగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ తెలియజేసింది. తగ్గుతున్న ఉష్ణోగ్రతలతో చలి పెరిగిన ప్రభావం విద్యుత్ డిమాండ్‌పై పడింది. గత వారం రోజుల వరకు గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం 55 మిలియన్ యూనిట్ల నుంచి 45 మిలియన్ యూనిట్లకు పడిపోయింది. గత వారం రోజులుగా హైదరాబాద్ మహానగరంలో విద్యుత్ డిమాండ్ 43 ఎం.యూల నుంచి 46 ఎంయూల మధ్య స్థిరంగా కొనసాగుతుంది.

చలి తీవ్రత పెరగడంతో చలి తీవ్రత నుంచి తట్టుకోవడానికి ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందు కోసం జనాలు ఎక్కువగా మంకీ క్యాప్స్, మఫ్లర్స్, ఉలెన్ షటర్స్ , బ్లాంకెట్స్, గ్లౌజ్‌లు వంటి వాటిని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్ మహానగరంలో శివారు ప్రాంతాలలో రోడ్ల వెంట నెపాల్ ప్రాంతానికి చెందిన వ్యాపారులు పెద్ద ఎత్తున శటర్స్‌కు, మంకీ క్యాప్స్, బ్లాంకెట్స్‌కు సంబంధించిన దుకాణాలను ఏర్పాటు చేశారు. శీతాకాలం ప్రారంభంలోనే చలి తీవ్రత పెరగడంతో తమ వ్యాపారం పెరిగిందని అంటున్నారు.

# ప్రత్యేక ప్రచారం 2.0ని విజయవంతంగా నిర్వహించిన హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ



న్యూఢిల్లీ, నవంబర్ 1:ప్రత్యేక ప్రచారం 2.0ని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2022 అక్టోబర్ 2 నుంచి 31 వరకు విజయవంతంగా నిర్వహించింది. ప్రజలు సందర్శించే ప్రాంతాలతో సహా ఫీల్డ్ మరియు అవుట్‌స్టేషన్ కార్యాలయాలతో సహా 11,559 ప్రాంతాలలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగా ఎంపీ రెఫరెన్స్‌లు, పార్లమెంటరీ హామీలు, ఐఎంసీ సూచనలు, రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, పీఎంఓ సూచనలు, ప్రజా సమస్యలు, మరియు పీజీ అప్పీల్స్ వంటి వివిధ తరగతుల్లో పెండింగ్ లో ఉన్న అంశాలను హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమర్థవంతంగా పరిష్కరించింది.

ప్రత్యేక ప్రచారం 2.0 లో మంత్రిత్వ శాఖ దాని అనుబంధ/ మంత్రిత్వ శాఖ ఇంతవరకు 1,40,99,510 రూపాయల ఆదాయాన్ని ఆర్జించింది. దాదాపు 90,525 చదరపు అడుగుల స్థలం వినియోగంలోకి అందుబాటులోకి వచ్చింది.

ప్రత్యేక ప్రచారం 2.0 అమలుకు నిర్వహించిన సన్నాహక దశలో మొత్తం 5,126 ప్రజా ఫిర్యాదులు మరియు అప్పీళ్లు పరిష్కారం కోసం మంత్రిత్వ శాఖ గుర్తించింది. వాటిలో 4,708 ప్రజా క్ ఫిర్యాదులు మరియు అప్పీళ్లు సమర్థవంతంగా పరిష్కరించబడ్డాయి. కార్యక్రమం అమలుకు సంబంధించి కేంద్ర సాయుధ పోలీసు దళం, ఢిల్లీ పోలీసులు మరియు అటాచ్డ్/సబార్డినేట్



సబార్డినేట్ కార్యాలయాల్లో మొత్తం 5.15 లక్షల ఫైళ్లను సమీక్షించాలని గుర్తించారు. . వీటిలో 4.77 లక్షల ఫైళ్లను పరిశీలించి 2.81 లక్షల ఫైళ్లను తొలగించారు.

పనికిరాని వ్యర్థాలను తొలగించడం ద్వారా హోం వ్యవహారాల కార్యాలయాలు 2,000 కంటే ఎక్కువ ట్వీట్లు పోస్ట్ చేశాయి. వీటిలో 200 కంటే ఎక్కువ ట్వీట్లు మంత్రిత్వ శాఖ ఖఎః ట్విట్టర్ ఎ ే శ ్య ం డ ి ల ్ల ఏఖఎఃఊనీఎవంటటజీతీతీబ నుండి రీ-ట్వీట్ చేయబడ్డాయి.

# గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుదాకా కేంద్రంపై పోరాటాలు : అజ్మీర సీతారాం నాయక్

ములుగు , నవంబర్ 1:గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేసేంతవరకు కేంద్రంపై పోరాటాలు చేస్తామని మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ వెల్లడించారు.

వర్సిటీ పై నాన్చుడు ధోరణిని అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రేపు ములుగు జిల్లా కేంద్రంలోని ఘట్టమ్మ దేవాలయం వద్ద వామపక్షాలతో కలిసి నిరసన దీక్ష చేపడుతున్నట్లు మీడియా సమావేశంలో వెల్లడించారు.

రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా 13వ షెడ్యూల్లో ఇరు రాష్ట్రాల్లో విద్యాభివృద్ధికి గిరిజన యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని కేంద్రం చట్టం చేసిందని గుర్తు చేశారు. ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించినప్పటికీ కేంద్రం పట్టించుకోకుండా పక్షపాత వైఖరిని అవలంభిస్తుందని ఆరోపించారు.

కేంద్రం తీరుకు నిరసనగా ఈనెల 2న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిరసన దీక్షను చేపడుతున్నట్లు వెల్లడించారు. వామపక్ష పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# గుజరాత్ మృతులకు సంతాపం ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు బైడెన్

న్యూఢిల్లీ, నవంబర్ 1: గుజరాత్‌లోని మచ్చు నదిపై వంతెన కూలిన ఘటనలో 141 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మృతులకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు సానుభూతిని తెలిపారు. ఇవాళ మా హృదయాలు భారత్‌తో ఉన్నాయని, వంతెన కూలిన సమయంలో ప్రియమైన వారిని కోల్పోయిన కుటుంబాలకు తాను, జిల్ బైడెన్ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం' అని బైడెన్ ట్వీట్ చేశారు. క్లిష్ట సమయంలో భారత ప్రజలకు అండగా నిలుస్తామన్నారు.గుజరాత్‌లోని మోర్బి జిల్లాలో మచ్చు నదిపై చోటుచేసుకొన్న కేబుల్ బ్రిడ్జి రెండురోజుల కిందట కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాద ఘటనలో సోమవారం నాటికి మృతుల సంఖ్య 141కి చేరింది. ఇందులో ఎక్కువగా మహిళలు, పిల్లలే మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. నదిలో కొట్టుకుపోయినవారిని గాలించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ, భారత నేవీ సహాయ చర్యలను కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న వంతెనకు ఇటీవల మరమ్మతులు పూర్తి చేశారు.ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండానే పునః ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఈ ఘోర ప్రమాదం చోటు చేసుకున్నది. ఈ వంతెనను 1879లో నిర్మించారు. దీని వెడల్పు 1.25 మీటర్లు కాగా, పొడవు 233 మీటర్లు. దర్బార్‌గఢ్ ప్యాలెస్, నజర్‌బాగ్ ప్యాలెస్‌ను కలిపేందుకు అప్పటి పాలకుడు సర్ వాఘ్‌జీ ఠాకూర్ దీన్ని నిర్మించారు. బ్రిడ్జికి మరమ్మతులు చేయాల్సి రావడంతో ఈ ఏడాది మార్చిలో దీన్ని మూసేశారు. ఓరెవా కంపెనీకి 15 ఏండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. గుజరాతీ కొత్త సంవత్సరం సందర్భంగా ఈ నెల 26న మళ్లీ రీ ఓపెన్ చేశారు. ఇంతలోనే ఈ దుర్ఘటన జరుగడంతో 141 మంది ప్రాణాలు కోల్పోయారు.

# కార్మికుల బోనస్‌ను నాలుగింతలు పెంచిన చైనా ఐఫోన్ కంపెనీ.

న్యూఢిల్లీ, నవంబర్ 1: చైనాలో యాపిల్ ఫోన్‌ల ప్రధాన సరఫరాదారు అయిన ఫాక్స్‌కాన్ కంపెనీ.. సెంట్రల్ చైనాలోని ఝెంగ్‌ఝౌ ప్లాంటులో పనిచేసే తన కార్మికుల రోజువారి బోనస్‌ను నాలుగింతలు పెంచింది. దాంతో ఇప్పటివరకు 100 యువాన్‌లు (13.5 అమెరికన్ డాలర్లు)గా ఉన్న కార్మికుల డైలీ బోనస్.. ఇప్పుడు 400 యువాన్ (55 అమెరికన్ డాలర్‌లు)లకు పెరిగింది.ఇంతకూ ఉన్నట్టుండి ఫాక్స్‌కాన్ కంపెనీ అంత భారీస్థాయిలో కార్మికుల బోనస్‌ను ఎందుకు పెంచిందనుకుంటున్నారా..? దానికో చిన్న కారణం ఉంది. చైనాలో కరోనా కేసులు పెరుగుతుండటంతో నిబంధనలు కఠినం చేశారు. దాంతో ఫాక్స్‌కాన్ కంపెనీలో పనిచేసే వర్కర్లపై మేనేజ్‌మెంట్ కఠిన ఆంక్షలు అమలు చేసింది. దానికితోడు కార్మికుల సౌకర్యాలకు కోతపడింది. ఫ్యాక్టరీలో ఆహార నిల్వలు తరిగిపోయాయి. వైద్య సేవలు కూడా మునుపటిలా అందడంలేదు.

దాంతో విసుగు చెందిన కార్మికులు కంపెనీని విడిచి పారిపోతున్నారు. అరకొర సంపాదన కోసం ఇన్ని ఆంక్షల నడుమ పనిచేయడం అవసరమా..? అనుకుని కంపెనీని వీడి వెళ్లిపోతున్నారు. ఈ క్రమంలో కార్మికులు వెళ్లిపోకుండా కాపాడుకోవడం కోసం ఫాక్స్‌కాన్ బోనస్‌ను ఎరగా వేసింది. అధిక బోనస్‌కు ఆశపడి కార్మికులు కష్టమైనా భరించే పరిస్థితిని కల్పించింది.

# తిరుమలలో వైభవంగా పుష్పయాగం

తిరుపతి, నవంబర్ 1:వార్షిక పుష్పయాగం సందర్భంగా మంగళవారం తిరుమల ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీ మలయప్ప స్వామి, శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా గార్డెన్ కార్యాలయం నుంచి తిరుమల ఆలయం వరకు టన్నుల కొద్దీ వివిధ రకాల పూలు, ఆకులతో ఊరేగింపును వైభవంగా నిర్వహించారు.

టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి మాట్లాడుతూ కార్తీక మాసంలో శ్రీవేంకటేశ్వర స్వామి జన్మ నక్షత్రమైన శ్రావణమాసంలో వార్షిక బ్రహ్మోత్సవం అనంతరం పుష్పయాగం నిర్వహిస్తామన్నారు. మానవాళిని, పశు,పక్ష్యాదులను భూకంపాలు, తుఫానులు, అంటువ్యాధుల నుంచి రక్షించాలని కోరుతూ వార్షిక పుష్పయాగాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

చామంతి, మొగలి, కనకాంబరం, వివిధ రకాల గులాబీలు, తామరలు, లిల్లీలు, మనుసంపంగి, మనోరంజితంతో పాటు తొమ్మిది టన్నులకు పైగా పూలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవోతో పాటు ఆలయ డీఈవో రమేష్‌బాబు, ఉద్యానవన డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, వీజీఓలు బాలిరెడ్డి, గిరిధర్, ఏవీఎస్‌వోలు గిరిధర్, శివయ్య, పారుపట్టేదార్ తులసీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




ఆహ్వానం

చంద్రలత
నీలంపురాశి
భరిణలకెత్తుతూ... బండ్లకెత్తుతూ... ఓడలకెత్తుతూ...

నవల ఆవిష్కరణ సభ

సాయంకాలం 5-00 గం.లకు
ఆదివారం, 13 నవంబర్ 2022
ప్రభవలో

ఆవిష్కర్త ఆచార్య జి.ఎం. సుందరవల్లి
ప్రత్యేక అతిథి డా. వి. ప్రసూన చంద్రశేఖర రావు, గుంటూరు
ఆత్మీయ అతిథులు విరపు బాలసుబ్రమణ్యం, ఎం.ఎల్.సి, నెల్లూరు
గుడిపూడి సుబ్బారావు
విశ్వేశ్వరరావు
నవల పరిచయం డా. ఈమని శివనాగిరెడ్డి, స్థపతి, హైదరాబాద్
ఆచార్య మధురాంతకం నరేంద్ర, రచయిత, తిరుపతి
బండ్ల మాధవరావు, సంపాదకులు, కవితా! విజయవాడ
స్పందన చంద్రలత, రచయిత, ప్రభవ
నిర్వహణ ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, రచయిత, తిరుపతి
ఆహ్వానం ఈతకోట సుబ్బారావు, సంపాదకులు, నెల్లూరు

సహృదయ సాహితీమిత్రులకు
మా సాదర ఆహ్వానము

సాహితీమిత్రులు Regd. No. 48/2012/V విజయవాడ
ప్రభవ నెల్లూరు

# స్పీడ్‌కు కళ్లెం

ప్రమాదాల నివారణకు
లేజర్ స్పీడ్ గన్ సేవలు ప్రారంభం
అరవై దాటితే అంతే సంగతులు








రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశానుసారం వాహనదారుల మితిమీరిన వేగానికి కళ్లెం వేయడానికి రాజన్న సిరిసిల్ల పోలీస్ లు శ్రీకారం చుట్టారు. అతివేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి జరిమానా విధిస్తున్నారు. వాహనాల అతివేగం నియంత్రణ, ప్రజల ప్రాణాల రక్షణనే లక్ష్యంగా స్పీడ్ లేసర్ గన్ ఉపయోగిస్తున్నారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్ ఐ రాజు సిరిసిల్ల బై పాస్ ప్రాంతంలో స్పీడ్ లేసర్ గన్ తో అతి వేగంగా వెళ్లే వాహనాలపై జరిమానాలువిధించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్ ఐ రాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు ప్రధాన రహదారుల మీద 60 స్పీడ్ వేగం మించకుండా మరియు మున్సిపల్, గ్రామాల పరిధిలో మూల మలుపుల వద్ద, పాఠశాలలు, కళాశాలల వద్ద 40 స్పీడ్ వేగము మించకుండా ప్రయనించవలెను అన్నారు. అదేవిధంగా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించవలెను అన్నారు. స్పీడ్ లేజర్ గన్ యంత్రాన్ని ప్రతి రోజు వేర్వేరు ప్రదేశాలలో వుంచి అతి వేగంగా వెల్లుచున్న వాహనాల ఫోటోలు తీసి జరిమానాలు విధించడం.

# డీఏవీ పాఠశాల అనుమతి పునరుద్ధరణ

హైదరాబాద్, నవంబర్ 1: బంజారాహిల్స్‌లోని డీఏవీ పాఠశాల అనుమతిని రాష్ట్ర విద్యాశాఖ పునరుద్ధరించింది. ఈ విద్యా సంవత్సరానికి తాత్కాలిక అనుమతిని విద్యాశాఖ ఇచ్చింది. ఆ పాఠశాలలో చిన్నారిపై లైంగిక దాడి ఘటన చోటు చేసుకోవడంతో ఆ స్కూల్ గుర్తింపును విద్యాశాఖ రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల గుర్తింపు రద్దును వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖకు విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. పేరెంట్స్ విజ్ఞప్తి మేరకు ఈ విద్యా సంవత్సరానికి పాఠశాలను కొనసాగించవచ్చని విద్యాశాఖ అనుమతి ఇచ్చింది. విద్యాశాఖ సూచించిన నిబంధనలు పక్కాగా అమలు చేయాలని ఉత్తర్వుల్లో ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

# కూరగాయల ధరల పెంపుతో సామాన్యుడు ఆగమాగం!

న్యూఢిల్లీ, నవంబర్ 1: కరోనా మహమ్మారి వ్యాప్తితో గత రెండేండ్ల నుంచి కూరగాయల ధరలు కొండెక్కడంతో ఏం తిని బతకాలో తెలియని పరిస్థితుల్లో సామాన్యుడు సతమతమవుతున్నాడు. కూరగాయల ధరలు భారమవడంతో గత రెండేండ్లుగా వీటి కొనుగోలుపై నెలకు 25 నుంచి 100 శాతం వరకూ అదనంగా వెచ్చించాల్సి వస్తోందని 76 శాతం మంది గృహస్తులు వెల్లడించారు.

ప్రముఖ కమ్యూనిటీ సోషల్ మీడియా వేదిక లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో ధరల పెంపుపై షాకింగ్ వివరాలు వెలుగుచూశాయి.

ధరల పెరుగుదలతో ఈ ఏడాది కిలో టమాటపై రూ 50, ఉల్లిగడ్డలకు రూ 30, ఆలుకు కిలోకి రూ 25 చొప్పున అధికంగా వెచ్చించాల్సి వచ్చిందని ఇద్దరు గృహస్తుల్లో ఒకరు వెల్లడించారని సర్వే తెలిపింది. ఇక 36 శాతం వినియోగదారులు కూరగాయలు కొనేందుకు 25 నుంచి 50 శాతం అధికంగా ఖర్చు చేస్తున్నారని, 31 శాతం మంది కూరగాయలపై ఖర్చు ఏకంగా 50 శాతం నుంచి రెట్టింపు కూడా అయిందని వెల్లడించారు.

స్థానికంగా పండే కూరగాయలు మినహా దూర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయల ధరలు మండిపోతున్నాయని వినియోగదారులు చెప్పుకొచ్చారు. ఇక సెప్టెంబర్‌లో ఆహార ద్రవ్యోల్బణం 8.60 శాతానికి ఎగబాకగా అక్టోబర్‌లో మరింత పెరగడంతో కూరగాయలు, పండ్లు సహా ఆహారోత్పత్తుల ధరలు అనూహ్యంగా పెరిగాయి.

# రైతు శ్రేయస్సు కోసం తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట

## -జిల్లా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి.



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ న్యాల కొండరాఘవరెడ్డి అన్నారు .మంగళవారం కోనరావుపేట్ మండలంలో నిమ్మపల్లి, జై సేవలాల్ ఊరు తండ, కొనరవుపేట్, శివంగలవల్లి, ఎగ్లాస్పూర్ గ్రామాలలో కొనరవుపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మరియు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి ప్రారంభించారు . ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రైతులకు పెట్టుబడి సహాయంగా రైతు బంధు పథకం ద్వారా వారి ఖాతాలో నగదు జమ చేసిందని, గత ప్రభుత్వాల వల్ల రైతాంగం చాలా నష్టపోయిందని మరి మన రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతే రాజుగా చూడాలని వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు తీసుకొచ్చి పెట్టుబడి సహాయం కింద రైతుబంధు మరియు రైతు బీమా రైతులకు ఉచిత 24 గంటల కరెంటు మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకవచ్చి ందని అన్నారు. ఎమ్మెల్యే రమేష్ బాబు కృషితో మల్కపెట్ రిజర్వాయర్ ద్వారా కొనారవుపేట్ మండలం మరో కొనసీమ కాబోతుందని అన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి సెంటర్లు మరియు పాక్స్ సెంటర్లలో ధాన్యాన్ని అమ్మాలని గ్రేడు ఏ రకం ధాన్యానికి 2060 రూపాయల మద్దతు ధర ఇస్తుందని, సాధారణ రకం 2040 రూపాయల మద్దతు ధరను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని, రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఎం సివిల్ సప్లై హరి కృష్ణ,డి సి ఎస్ ఓ జితేందర్ రెడ్డి, ఎంపిడిఓ రామకృష్ణ, ఎమ్మార్వో నరేందర్, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, సర్పంచుల ఫోరమ్ జిల్లా కార్యదర్శి మంతెన సంతోష్, సర్పంచులు శ్రీనివాస్, రాములు నాయక్, పోకల రేఖ, సురేష్, దండే ఎల్లవ్వ, ప్రవీణ్ నాయక్, తిరుపతి నాయక్, సూర్య నాయక్, అశోక్, జగన్నాయక్, ఎంపీటీసీ లు గోగు భారతి, నర్సింహ చారి, రైతు సమన్వయసమితి అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, తెరాస నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలను అరికట్టాలి-డిసిపి చంద్రమోహన్




కరీంనగర్, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో కళాశాలలో షీటీమ్ అధ్వర్యములో సైబర్ నేరాలపై మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి.సి.పి జి. చంద్రమోహన్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటే కళాశాలలో చదువుకున్న విద్యార్థులు కొందరు ఉన్నత స్థానంలోకి వెళతారు. మరి కొందరు సైబర్ నేరాలకు బలిఅవుతారు. ఫేస్బుక్ మరియు ఇన్స్టాగ్రామ్ లను అధికముగా వాడకూడదన్నారు. చదువుకోవడానికి రకరకాల ఆఫ్ లు ఉపయోగపడతాయి కానీ నెట్వర్క్ దుర్వినియోగపరుచుకోరదాని అన్నారు. సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రపంచంలో ఎక్కడ లేని రక్షణ విధానం భారతదేశంలో ఉందన్నారు. ఎలాంటి సమస్య ఉన్న షీటీమ్ వారికి తెలియజేయలన్నారు. గంజాయి, డ్రగ్స్ కల్చర్ రూరల్ ప్రాంతాలకు కూడ వ్యాపించదన్నారు. ప్రతి సబ్జెక్టుకు ప్రాముఖ్యత ఉండడం వల్ల ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు వేళ్ళాలన్నారు. ఎంతో మందిని తీర్చిదిద్దుతున్న నరేందర్ రెడ్డిని అభినందిస్తున్నాను అని అన్నారు. ఏ.సి.పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇన్స్టాగ్రామ్, వాట్సాప్ లేకపోతే విద్యార్థులు నామూషీ ఫీలవుతూన్నారు. ఏవరైనా బాగున్నావు అని అంటే మురిసిపోయి స్నేహం పెంచుకొని సోషల్ మీడియా ద్వారా కుటుంబాన్ని రోడు పైకి తీసుకువచ్చేటట్లు ప్రవర్తిస్తున్నారు. ఏన్నో కలలతో చదువును ప్రారంభించిన విద్యార్థులు సెల్ఫోన్ వాడకం వల్ల చాటింగ్ కు అలవాటు పడి తమ లక్ష్యాలకు దూరమవుతున్నారు. పోలీసులకు తెలియజేయడం వల్ల కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకురావచ్చున్నారు. ప్రతి ఒక్కరు హాక్ ఐ యాప్ ను డౌన్లోడ్ చేసుకోలన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ సమస్య ఏదురైతే 1930 మరియు 100 కి కాల్ చేయాలని తెలిపారు.

డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలను అపాలనే షీటీమ్ ప్రయత్నాన్ని అభినందిస్తున్నాను అని అన్నారు. సెల్ఫీలు, స్టేటస్లు వాడేముందు చాలా జాగ్రత్త పడాలన్నారు. టినేజి విద్యార్థులు తెలిసి తెలియక తప్పులు చేస్తారు. ఆన్లైన్ నేరాలకు బలికావద్దన్నారు.

ఈ కార్యక్రమములో షీటీమ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. శ్రీనివాస్, కరీంనగర్ త్రిటౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ దామోదర్ రెడ్డి, షీటీమ్ ఏఏస్సై విజయమణి మరియు షీటీమ్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యపకులు, విద్యార్థినులు పాల్గోన్నారు.

# కేటీఆర్ రోడ్డు షోలో జనమే జనం

## - కేటీఆర్ ప్రసంగానికి విశేష స్పందన
## - మంత్రి పువ్వాడ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్స్ తో రోడ్ షో
## - భారీగా తరలిన శ్రేణులు



ఖమ్మం, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి ): మునుగోడు నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చివరి రోజు టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మంత్రి కే.టీ.రామారావు నిర్వహించిన రోడ్డు షోకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మండల కేంద్రంలోని చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ రోడ్డు షోకు ముందు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో చేపట్టిన మోటార్ సైకిల్ లో ఖమ్మం నగరం నుండి తరలిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్డు షోలో అన్ని కూడళ్లలో గులాబీ శ్రేణులు, యువత బాణాసంచా పేల్చుతూ, పూలు చల్లుతూ కేటీఆర్ కి దారి పొడవునా అపూర్వ స్వాగతం పలికారు.

ఆయా చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఫ్లోరోసిస్ రక్కసిని పాతరబెట్టి పరిశుద్ధమైన తాగునీళ్లను అందిస్తున్న, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు గాను టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డిని ఓటేసి గెలిపించాల్సిందిగా కోరారు.

కేటీఆర్ ప్రసంగానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది."జై తెలంగాణ జై జై తెలంగాణ", "జై కేసీఆర్ జై జై కేసీఆర్", "జిందాబాద్ జిందాబాద్ టీఆర్ఎస్ జిందాబాద్","కారు గుర్తుకే మన ఓటు"అనే నినాదాలతో వీధులన్నీ హోరెత్తాయి.

# 12 నుంచి ఐ-లీగ్.. కేరళలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ సమాఖ్య

అమరావతి: నవంబర్ 1:2022-23 ఐ-లీగ్ టోర్నమెంట్ నవంబర్ 12 నుంచి కేరళలోని మలప్పురం వేదికగా నిర్వహిస్తున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) వెల్లడించింది. టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్స్ గోకులమ్ కేరళ జట్టు రన్నరప్ మొహమ్మదన్ స్పోర్టింగ్ జట్టుతో తలపడనుంది. గత రెండు సీజన్‌లు లీగ్ టోర్నమెంట్లు బయో బబుల్ విధానంలో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, కల్యాణి, నయిహటి వేదికగా మ్యాచ్‌లు జరిగిన విషయం తెలిసిందే. కొవిడ్ ఆంక్షలు తొలగించిన నేపథ్యంలో ఈసారి టోర్నమెంట్‌లో 12 ఫుట్‌బాల్ జట్లు పాల్గొంటున్నాయి. దేశవ్యాప్తంగా 13 వేదికలుగా మ్యాచ్‌లు జరుగనున్నాయి. డిఫెండింగ్ చాంపియన్స్ గోకులం కేరళ జట్టు స్వస్థలం మలప్పురం (కేరళ)లోని పయనాడ్ స్టేడియంలో ఆరు మ్యాచ్‌లు ఆడనుంది. మిగిలిన ఐదు మ్యాచ్‌లు కోజికోడ్‌లోని ఈఎంఎస్ స్టేడియంలో ప్రత్యర్థి జట్లతో తలపడనుంది. డెక్కన్ అరెన (హైదరాబాద్), ఛత్రశాల్ స్టేడియం (న్యూఢిల్లిట), బక్షి స్టేడియం (శ్రీనగర్)లతోపాటు ముంబై, రాజస్థాన్‌లోని అంబేద్కర్ స్టేడియం, కెంక్రీ తదితర మైదానాల్లో మ్యాచ్‌లు జరుగుతాయని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య ఒక ప్రకటనలో వివరించింది.

# కళాకారులకు హెల్త్ కార్డులను,ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేయాలి

## నృత్య కళానికేతన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యెల్ల పోశెట్టి




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 1: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయం నందు మంగళవారం జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య రాజన్న సిరిసిల్ల జిల్లా కళాకారుల కమిటీ సభ్యుల సమావేశమునకు వ్యవస్థాపక అధ్యక్షులు యెల్ల పోశెట్టి అధ్యక్షతన జరిగింది . ముందుగా కళాకారులు పాటలు జానపద గేయాలను ఆలపించారు. అనంతరం ఈ సమావేశంలో యెల్ల పోశెట్టి మాట్లాడుతూ కళాకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డులను అందజేసి కళాకారులను ఆదుకోవాలని కోరారు. కళాకారులందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులను అందజేసి అర్హులైన కళాకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి అలాగే 57 సంవత్సరాలు నిండిన వృద్ధ కళాకారులకు కొత్తగా దరఖాస్తులను స్వీకరించి వృద్ధాప్య పింఛన్లను మంజూరీ చేసి కళాకారుల కుటుంబాలను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈనెల 5వ తేదీన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ సమావేశ మందిరం నందు జిల్లా సాంస్కృతిక కళా సంస్థల సమాఖ్య జిల్లా కార్యవర్గం ఎన్నికలు ఈ నెల 5 వ తేదీన శనివారం మధ్యాహ్నం 2:00 గంటలకు నిర్వహించబడును 13 మండలాల నుండి కళాకారులందరూ పాల్గొని కోరారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బొడ్డు రాములు జిల్లా గౌరవ అధ్యక్షులు, శ్రీనివాస్ జిల్లా కన్వీనర్, వారాల దేవయ్య జిల్లా కోకన్వీనర్, బుర్రి శంకరయ్య జిల్లా కోకన్వీనర్, మారం ప్రవీణ్ కుమార్ జిల్లా కోకన్వీనర్, వివిధ మండలాల బాధ్యులు వనం రాజయ్య (గంభీరావుపేట) ,దాసరి అంజయ్య,(ఇల్లంతకుంట )ఆడెపు చెందు (బోయినపల్లి), మామిళ్ళ సత్తయ్య (వేములవాడ ),ఎర్రం దేవయ్య( చందుర్తి) పాల్గొన్నారు. ఈ సమావేశంలో13 మండలాల నుండి 25 మంది కళాకారులు జిల్లా అడహక్ కమిటీ బాధ్యతలు అందరూ పాల్గొన్నారు.

# మునుగోడులో తమ ఓటు టీఆర్ఎస్‌కే : రజక వృత్తిదారుల సమాఖ్య




హైదరాబాద్, నవంబర్ 1:రాష్ట్రంలో కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న లక్షలాధి మంది రజకులకు సంక్షేమ పథకాలు, ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత టీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని తెలంగాణ రాష్ట్ర రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ తెలిపారు. మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికే తమ ఓటు వేసి గెలిపించాలని మునుగోడు రజకులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో తెలంగాణ వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.

రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల అభ్యున్నతి, వారి జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందని ఆయన పేర్కొన్నారు. బీసీల కుల గణన చేయకుండా కేంద్రం మోసం చేస్తుందని మండిపడ్డారు. ఈనెల 3న జరిగే పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేయాలని రజకులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

# బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్‌కు ఆవకాయ రుచి చూపించిన మెగాస్టార్..!

హైదరాబాద్, నవంబర్ 1:మెగాస్టార్ చిరంజీవిని బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ వైన్ ఓవెన్ మర్యాదపూర్వకంగా కలిశారు. బ్రిటన్, భారత్‌కు సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా ఇరువురూ చర్చించుకున్నారు. ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాలతో యూకేకు ఉన్న అనుబంధం గురించి మాట్లాడుకున్నారు. మర్యాద పూర్వకంగా జరిగిన ఈ భేటీకి సంబంధించిన ఫోటోలను మెగాస్టార్ ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు.

'బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్‌ను కలవడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయనకు విందు ఏర్పాటు చేసి.. మన తెలుగు వంటకాలను రుచి చూపించా. నోరూరించే అవకాయను కూడా ఆయన రుచి చూశారు" అంటూ చిరు ట్విట్టర్‌లో తెలిపారు.

**IN THE COURT OF THE M.A.C.T-CUM-I- ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD**
**O.P. NO.710 OF 2019**

Between:
**T. Vijay Kumar @ T. Babu**
**V/S P. Madhu Bushan & Others**

**NOTICE**

**To**
R1 P. Madhu Bushan
S/o. P. Madhu Sudhan
R/o. 1-2-283, Station Rd,
Bhongiri, Nalgonda.

WHERARS the Petitioner has filed the above case for compensation under M.V. Act and Rules and the same is posted for your appearance and counter on **03.11.2022.**

Hence, you are requested to appear before the said Hon'ble Court, at 10.30 AM either in your person or through your Advocate on the said date, otherwisem the matter will be decided in your absence,

//BY ORDER//
Counsel for the Petitioners
**M/S. P. SRINIVAS**
**M. DHANALAKSHMI**
**N. RAJU NAIK**
**K. SNEHA**
**Advocates**
**H.NO. 6-18/1**
**"SHREE' NIVAS,Sreeram Nagar Colony**
**Anupuram, Kapra**
**ECIL, Hyderabad- 500 062**
**Cell: 9246365011**




Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.